RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 40 ISSUE NO : 40 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | ఆదివారం, జూలై 27, 2025 Sunday, July, 27, 2025 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-



### విద్యార్థుల ఆత్మహత్యలపై

# కదిలిపోయిన.. సుప్రీంకోర్టు

## నివారణకు సంచలన మార్గదర్శకాలు

ఢిల్లీ,: దేశంలోని విద్యా సంస్థల్లో ఆందోళనకరంగా పెరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలను అరికట్టేందుకు సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా విద్యార్థులకు మానసిక ఆరోగ్యం, మద్దతు అందించేందుకు ఉద్దేశించిన 15 సమగ్ర మార్గదర్శకాలను సర్వోన్నత న్యాయస్థానం తాజాగా జారీ చేసింది. ఈ మార్గదర్శకాలు స్కూళ్లు, కళాశాలలు, కోచింగ్ సెంటర్లు, విశ్వవిద్యాలయాలు, శిక్షణ అకాడమీ లు, హాస్టళ్లు సహా అన్ని విద్యా సంస్థలకూ వర్తిస్తాయి. విద్యా ఒత్తిడి, పరీక్షల భయం, సంస్థాగత మద్దతు లోపం వల్లే విద్యార్థులు ఆత్మహత్య లకు పాల్పడుతున్నారని కోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

- 'మార్నింగ్ కన్సల్ట్' సంస్థ గ్లోబల్ లీడర్ సర్వే
- ఈ సర్వేలో అత్యంత విశ్వసనీయ నేతగా మోదీకి అగ్రస్థానం
- మోదీకి దాదాపు 75 శాతం మంది మద్దతు
- ఈ జాబితాలో దక్షిణ కొరియాకు చెందిన లీ జే-మ్యుంగ్ కు రెండో స్థానం

### అత్యంత విశ్వసనీయ నేతగా

# ప్రధాని మోదీ

ఢిల్లీ,: ప్రధాని నరేంద్ర మోదీకి మరో అరుదైన గుర్తింపు లభించింది. ప్రపంచంలోనే అత్యంత విశ్వసనీయ నేతగా ఆయన నిలిచారు. 'మార్నింగ్ కన్సల్ట్' సంస్థ గ్లోబల్ లీడర్ సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో భారతీయులతో పాటు ప్రపంచ వ్యాప్తంగా మిలియన్ల మంది విశ్వసించే నేతగా ప్రధాని మోదీ మొదటిస్థానంలో నిలిచారు. దాదాపు 75 శాతం మంది మద్దతుతో అత్యంత విశ్వసనీయత కలిగిన నాయకుడిగా మోదీ ప్రపంచ జాబితాలో అగ్రస్థానంలో నిలిచారు. ఈ విషయాన్ని బీజేపీ నేత అమిత్ మాలవీయ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా వెల్లడిస్తూ హర్షం వ్యక్తం చేశారు.




న్యూఢిల్లీ, : 'సీఎం మార్పు' అంశంపై కర్ణాటక రాజకీయాల్లో తీవ్ర చర్చ జరుగుతున్న వేళ అనూ హ్య ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఐదేళ్లూ తానే ముఖ్యమంత్రినని సిద్ధరామయ్య చెబుతున్నా.. తన చేతుల్లో ఏమీ లేదని డీకే శివకుమార్ అంటు న్నా సీఎం పీఠం విషయంలో సిద్ధూ, డీకే వర్గాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో మరో కీలక విషయం తెరపైకి వచ్చిం ది. ఇటీవల ఢిల్లీలోని కర్ణాటక భవన్‌లో కర్ణాటక సీఎం, డిప్యూటీ-సీఎంల ప్రత్యేక అధికారులు పరస్పరం దాడి చేసుకున్నట్లు- పార్టీ వర్గాలు వెల్లడి స్తున్నాయి. దీంతో కర్ణాటక ప్రభుత్వంలో లుకలుక లు మరోసారి బయటపడ్డాయి. పార్టీ వర్గాల ప్రకారం.. సిద్ధరామయ్య వద్ద ప్రత్యేక అధికారిగా విధులు నిర్వహిస్తున్న మోహన్‌కుమార్ అనే అధి కారి తనను షూతో కొట్టినట్లు- శివకుమార్ వద్ద పనిచేసే ప్రత్యేక అధికారి ఆంజనేయ ఆరోపించా రు. షూతో కొట్టి పార్టీ నేతల ముందు తన గౌరవా నికి భంగం కలిగించి నందువల్ల.. అతడిపైచర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.



### డీకే శివకుమార్, సిద్ధరామయ్యల మధ్య

# తీవ్ర విభేదాలు

ఢిల్లీలో ఇరు నేతల అధికారులు బాహాబాహీ
ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన



### కార్గిల్ యుద్ధవీరుల

# సంస్మరణ

## నివాళి అర్పించిన రాష్ట్రపతి, ప్రధాని

న్యూఢిల్లీ, :కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా రాష్ట్ర పతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ.. అమర జవాన్లకు నివాళులు అర్పించారు. నాటి యుద్ధంలో పాక్‌పై విజయం కోసం జవానులు చేసిన త్యాగాలు భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయక మని అన్నారు. ప్రధాని, రాష్ట్రపతితో పాటు- త్రివిధ దళాధి పతులు కూడా అమర జవాన్‌లకు నివాళులు అర్పిం చారు. మాతృభూమి కోసం ప్రాణాలు అర్పించిన వీర జవాన్‌లకు తాను నివాళులు అర్పిస్తు న్నానని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఎక్స్ వేదికగా స్పందించారు. దేశ సైనికుల ధైర్యసాహసాలు, సడలని పట్టు-దలకు ఈ రోజు చిహ్నమని వ్యాఖ్యానించారు. వారి త్యాగాలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ కూడా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భారత మాత బిడ్డల ధైర్య సాహసాలు, త్యాగాలను ఈ రోజు గుర్తుకు తెస్తోం దని అన్నారు. భారత్ సగర్వంగా తలెత్తుకునేలా జవాన్‌లు తమ జీవితాలను అంకితం చేశారని వ్యాఖ్యానించారు. 1999లో పాక్‌పై యుద్ధంలో విజయాన్ని, అమర జవానుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ..



### భారత సైనిక వ్యవస్థ

# మరింత పటిష్టం

## - భవిష్యత్ ముప్పను ఎదుర్కొనేలా వ్యూహం

న్యూఢిల్లీ, జూలై26 : పాక్‌తో యుద్ధం, చైనాతో సరిహద్దు వివాదాల నేపథ్యంలో భారత సైన్యం ఎప్పటికప్పుడు వ్యూహాలను మారుస్తూ బలోపేతం అవుతోంది. ఇటీవలి ఆపరేషన్ సిందూర్‌లో మన బలగాల సత్తా చాటాయి. అయితే దీనిని మరింత ముందుకు తీసుకెళ్లే ప్రయత్నా లు జరుగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో శత్రుమూకల ఆట కట్టించే లా భారత సైన్యంలో ఓ శక్తిమంతమైన దళం ఏర్పాటైంది. భవిష్యత్తు ముప్పును ఎదుర్కొనేలా 'ఆల్ ఆర్మ్స్ బ్రిగేడ్'ను ఏర్పాటుచేసినట్లు సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది వెల్లడించారు. దీనికి 'రుద్ర' అని పేరు పెట్టినట్లు తెలిపారు. శనివారం 'కార్గిల్ విజయ్ దివస్ ' సందర్భంగా ఆయన అమరవీరులకు నివాళులర్పించారు.



### బనకచర్ల పేరుతో

# చంద్రబాబు కుట్రలు

- కృష్ణా నీటిని రాయలసీమకు తరలించే ఎత్తులు
- నికరజలాలే లేనప్పడే మిగులు జలాలు ఎక్కడివి
- చంద్రబాబుకు రేవంత్ రెడ్డి పరోక్ష సహకారం
- కృష్ణా,గోదావరి జలాలపై మరోమారు ఉద్యమిస్తాం
- బిఆర్ఎస్ విద్యార్థి విభాగం సమావేశంలో హరీష్ రావు

హైదరాబాద్,, తెలంగాణ దిశ :
సీఎం రేవంత్‌రెడ్డికి నిద్రలో కూడా కేసీఆర్ గుర్తుకు వస్తున్నారని, అందుకే ఆయన పేరును పదే పదే ప్రస్తావిస్తున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో హైదరాబాద్ మల్లాపూర్‌లోని ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు- చేసిన సదస్సులో గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు వల్ల కలిగే నష్టంపై ప్రజంటేషన్ ఇచ్చారు.
పజల్లోకి తీసుకెళ్లాల్సిన అంశాలు, భవిష్యత్ కార్యాచరణపై బీఆర్ఎస్వీ నేతలకు హరీశ్‌రావు దిశానిర్దేశం చేశారు. రేవంత్‌రెడ్డి ఏనాడూ జై తెలంగాణ అనలేదు. ఉద్యమ గుర్తులు, చరిత్ర చెరిపేసే ప్రయత్నం చేస్తున్నారు. రేవంత్‌రెడ్డి పాలనలో నీళ్లు ఆంధ్రాకు, నిధులు ఢిల్లీకి వెళ్తున్నాయి. కాంగ్రెస్, భాజపా, చంద్రబాబు కలిసి రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగిస్తున్నారని ధ్వజమెత్తారు.



### నిండుకుండలా మారిన

# ప్రాజెక్టులు

హైదరాబాద్, నల్గొండ, , తెలంగాణ దిశ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడన ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా కృష్ణా నది పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. శ్రీశైలం, నాగార్జున సాగర్ సహా వివిధ ప్రాజెక్టులలో నీటి మట్టాలు పెరుగుతున్నాయి.కర్ణాటకలోని జలాశయాల నుంచి నీటిని విడుదల చేస్తుండ టంతో జూరాలకు వరద ప్రవాహం కొనసాగు తోంది. ప్రాజెక్టులోకి 80 వేల క్యూసెక్కుల నీరు వస్తుండగా, 7 గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయానికి భారీగా వరద కొనసాగుతుంది. ఇన్ ఫ్లో 1,49,526 క్యూసెక్కులుగా ఉంది. పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులుగా ఉంది. ప్రస్తుతం 882.80 అడుగులుగా ఉంది. శ్రీశైలం నుంచి నీటితో నాగార్జునసాగర్ నిండుకుండలా మారింది.ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 579 అడుగులుగా కొనసాగుతుంది.



### టూవీలర్‌ను ఢీకొన్న

# ట్యాంకర్

## తండ్రీ కూతుళ్ల దుర్మరణం

రంగరెడ్డి, తెలంగాణ దిశ: రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ చౌరస్తాలో శనివారం ఉదయం ఘోర ప్రమాదం జరిగింది. ట్యాంకర్ లారీ ఢీకొట్టడంతో ద్విచక్రవాహనంపై వెళ్తున్న తండ్రి, కుమార్తె మృతి చెందారు. సీఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. షాద్‌నగర్‌కు చెందిన మచ్చేందర్.. శంషాబాద్ వర్ధమాన్ కళాశాలలో బీటెక్ చదువుతున్న తన కుమార్తె మైత్రిని కాలేజీకి పంపించేందుకు బైక్‌పై బస్టాప్‌కు బయలుదేరారు. షాద్‌నగర్ చౌరస్తా వద్దకు రాగానే వీరి ద్విచక్రవాహనాన్ని ట్యాంకర్ లారీ ఢీకొట్టింది. మచ్చేందర్ ఘటనాస్థలిలోనే మృతి చెందగా, మైత్రికి తీవ్రగాయాలై లారీ టైర్ల మధ్యలో ఇరుక్కు పోయింది. కాపాడండి అంటూ మైత్రి చేసిన ఆర్తనాదాలు స్థానికులను కంటతడి పెట్టించాయి.

# క్రీడల్లో బాలికలను ప్రోత్సహిద్దాం

**- మహిళలను ఛాంపియన్లుగా ప్రోత్సహిద్దాం**
**- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి**
**- అస్మిత - ఖేలో ఇండియా కిక్ బాక్సింగ్ 2025-26 ప్రారంభం**





**హైదరాబాద్, జూలై 26, (తెలంగాణ దిశ) :**క్రీడల్లో బాలికలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతో ఉందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి అన్నారు. ఈరోజు ఎల్ బి ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఖేలో ఇండియా- అస్మిత కిక్ బాక్సింగ్ లీగ్ 2025-26ను ఆయన ముఖ్య అతిథి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిక్ బాక్సింగ్ క్రీడా కేవలం పతకాలు సాధించడానికి మాత్రమే కాకుండా ఆత్మ రక్షణకు ఆత్మస్థైర్యానికి ఉపయోగ పడుతుందని ఇటువంటి క్రీడలలో విద్యార్థినీలను బాలికలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రోత్సాహక విధానాల వల్ల అనేక క్రీడా పోటీలు తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించుకోవడం జరుగుతుందని, అదేవిధంగా పలు జాతీయ అంతర్జాతీయ పోటీలకు మన రాష్ట్ర క్రీడాకారులు ఎంపిక అవుతున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన క్రీడా విధానంలో క్రీడల్లో బహుముఖంగా ప్రోత్సహించే విధంగా పటిష్టమైన నిబంధనలు రూపొందించామని తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ ఎ. సోనీ బాలాదేవి మాట్లాడుతూ గత ఆరు నెలల్లోనే ఖేలో ఇండియా "అస్మిత" రోయింగ్ ఫుట్ బాల్ పోటీలు నిర్వహించుకున్నామని అదేవిధంగా కిక్ బాక్సింగ్ పోటీలను కూడా నిర్వహించడం సంతోషకరమని అన్నారు. 18 జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనడం ఇందుకు స్పోర్ట్స్ అథారిటీ తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు రామాంజనేయులు కార్యదర్శి మహిపాల్ ఉపాధ్యక్షులు బాలాజీ కోశాధికారి పి. శ్రీనివాస్ సహాయ కార్యదర్శి నరసింగరావు, శేఖర్, భాగ్యరాజ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ కు తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ స్మారక పురస్కారం

**- రవీంద్రభారతిలో నేడు తెలంగాణ సన్మాన్ పురస్కారాల ప్రధానోత్సవం**

**హైదరాబాద్, జూలై 26, (తెలంగాణ దిశ) :**ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ కు తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ స్మారక పురస్కారాన్ని అందజేయనున్నట్లు తెలంగాణ కల్చరల్ ఫౌండేషన్ అధ్యక్షులు నారగౌని పురుషోత్తం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ కల్చరల్ ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం ఒకటి నుండి రాత్రి పది గంటల వరకు రవీంద్రభారతిలో తెలంగాణ సన్మాన్ 2025 పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ బీసీ, రవాణా సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, తెలంగాణ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. తెలంగాణ మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయ సంస్థ జాయింట్ సెక్రెటరీ శ్యాం ప్రసాద్ లాల్ సభకు అధ్యక్షత వహిస్తారని తెలిపారు. భాషాభివృద్ధి సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ గౌరవ అతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి




వైస్ చైర్మన్ ఇటిక్యాల పురుషోత్తం ప్రత్యేక అతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ కు తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ స్మారక పురస్కారాన్ని అందజేస్తామని వివరించారు. అదే విధంగా తెలంగాణ బీసీ కమిషన్ సభ్యురాలు రంగు బాలలక్ష్మికి వీరనారి చిట్యాల ఐలమ్మ స్మారక పురస్కారాన్ని అందజేస్తామని తెలిపారు. వీరితో పాటు సీనియర్ ఫిలిం క్రిటిక్ పొన్నం రవిచంద్రకు పైడి జయరాజ్ స్మారక పురస్కారం, ప్రముఖ గాయకులు దరువు అంజన్నకు ప్రజా యుద్ధ నౌక గద్దర్ స్మారక పురస్కారం, సీనియర్ పాత్రికేయులు కాసుల ప్రతాపరెడ్డికి తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి స్మారక పురస్కారాలను అందజేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

# రోడ్ల దుస్థితిని నిరసిస్తూ రోడ్లపై గుంతల్లో మొక్కలు నాటిన బిజెపి నేతలు





**కుత్బుల్లాపూర్, జూలై 26, (తెలంగాణ దిశ) :**నిజాంపేట్ లో రోడ్ల దుస్థితిని నిరసిస్తూ బిజెపి నేతలు శనివారం అంబేద్కర్ విగ్రహం ప్రాంగణంలో రోడ్లపై మొక్కలు నాటి నిరసన వ్యక్తం చేశారు. రోడ్ల మరమ్మత్తులను వెంటనే చేపట్టాలని నిజాంపేట్ బిజెపి అధ్యక్షులు బిక్షపతి యాదవ్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ కు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బిక్షపతి యాదవ్ మాట్లాడుతూ నిజాంపేట్ లోని వైకుంఠ ధామం నుండి అసలే ఇరుకైన రోడ్డని, అందులో రోడ్ల మీదనే వ్యాపారం చేస్తున్న వాళ్లే కాకుండా హెచ్ డిఎఫ్ సి బ్యాంకు ముందు నుండి అంబేద్కర్ స్టాచ్ వరకు రోడ్లు మరమ్మత్తు చేయకపోవడం ద్వారా తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురి అవుతూ హాస్పిటల్ పాలవుతున్నారని అన్నారు. గుంతల రోడ్ల వలన ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని అనేకమార్లు అధికారులకు విన్నవించినప్పటికీ దున్నపోతుపై వాన కురిసినట్టుగా అధికారులలో చలనం లేకపోవడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. తక్షణమే రోడ్ల మరమ్మత్తులతో పాటు నూతన రోడ్లు నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ సి మూర్తి, రాష్ట్ర అధికార ప్రతినిధి దాసి నాగరాజు, బాచుపల్లి ప్రగతి నగర్ అధ్యక్షులు ప్రసాద్ రాజు నరేంద్ర చౌదరి, వెంకటేష్ ముదిరాజ్, సెక్రెటరీ కౌశిక్ నాయుడు, సతీష్ కృష్ణ, పాండు, విష్ణు దత్తు, కుంకి రాము, సురేష్, రాజేష్ ముదిరాజ్, భూపాల్, ఈశ్వరరావు, వేణు తదితరులు పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ జూనియర్, యువజన వాలంటీర్లు ఐదు వందల యూనిట్ల రక్తాన్ని సేకరించాలి

**- జూనియర్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు మియాపురం రమేష్**





**నేరేడ్ మేట్, జూలై 26, (తెలంగాణ దిశ) :**రెడ్ క్రాస్ జూనియర్, యువజన విభాగం సైనికులు ఐదు వందల యూనిట్ల రక్తాన్ని సేకరించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్లాలని రెడ్ క్రాస్ సొసైటీ జూనియర్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు మియాపురం రమేష్ సూచించారు. సైనిక్‌పురిలోని భవన్స్ వివేకానంద కళాశాలలో జూనియర్, యువజన విభాగం 2025-26 వాలంటీర్ల ప్రేరణ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన జూనియర్, యువజన వాలంటీర్లు ప్రమాణ స్వీకారం చేశారు. కొత్తగా నియమించబడిన కార్యాలయ బేరర్‌లను అధికారికంగా వారి బ్యాడ్జ్‌లను అందజేశారు. అనంతరంమియాపురం రమేష్ మాట్లాడుతూ వివేకానంద కళాశాలలోని రెడ్ క్రాస్ జూనియర్ యువజన విభాగం వాలంటీర్ల ఆదర్శప్రాయమైన సేవలను అభినందించారు. స్వచ్ఛంద రక్తదాన శిబిరాలను నిర్వహించడంలో అద్వితీయమైన పాత్రను పోషిస్తున్నారని కొనియాడారు. జూనియర్ యువజన విభాగాలలో పనిచేసిన వాలంటీర్లు రెడ్ క్రాస్ సొసైటీలో భాగస్వామ్యం కావాలని సూచించారు. తద్వారా సమాజంలో మానవతా పద్ధతులను ప్రోత్సహించాలని సూచించారు. ఐఆర్ సిఎస్ మేడ్చల్ జిల్లా చైర్మన్ డాక్టర్ ఎస్ఎమ్. రాజేశ్వరరావు ఆధ్వర్యంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో మానవత సేవా కార్యక్రమాలను అందించడంలో ప్రథమ స్థానంలో ఉండడం అభినందనీయమన్నారు. జూనియర్ యువజన విభాగం వాలంటీర్లు మరింత చురుకుగా స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. ఇందులో భాగంగా త్వరలో చేపట్టబోయే రక్తదాన శిబిరంలో 500 యూనిట్ల రక్తాన్ని సేకరించాలని లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా వాలంటీర్లలో ప్రశంసనీయమైన మానవతా విలువలను కలిగించడానికి బాధ్యత వహించిన అధ్యాపకులు శ్రీనివాస్‌ను రమేష్ ప్రశంసించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక వేడుకలల్లో వాలంటీర్లు చురుకుగా పాల్గొన్నారు. ప్రతిభను నృత్యం, గానంతో మంచి ప్రతిభను ప్రదర్శించారు.



# పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

**- బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే వివేకానంద్**



**కుత్బుల్లాపూర్, జూలై 26, (తెలంగాణ దిశ) :**పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. శనివారం పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ సర్కిల్ లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వ్యక్తిగత రక్షణ పరికరాల కిట్ (పీపీఈ కిట్లను) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల సేవ, శ్రమ వెలకట్టలేనిదని అన్నారు. పరిసరాల పరిశుభ్రతతో ప్రజలంతా ఆరోగ్యంగా ఉండేలా చూస్తూ, కరోనా వంటి విపత్కర సమయంలో కూడా తమ సేవలు అందించిన పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యం కూడా ఎంతో కీలకమని, వారు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారన్నారు. పారిశుద్ధ్య కార్మికులు తమ వ్యక్తిగత రక్షణ కోసం ఈ కిట్లను వినియోగించుకొని జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ నరసింహ, ఏఎంహెచ్ఓ కవిత, ఎస్ఎఫ్ఏ లు, పారిశుద్ధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కూకట్ పల్లి యుపిహెచ్ఎస్ సెంటర్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్





**మేడ్చల్ కలెక్టరేట్, జూలై 26, (తెలంగాణ దిశ) :**యుపిహెచ్ఎస్ సెంటర్ లో గోడలు వర్షం నీరుతో నిమ్ము వస్తున్నందువల్ల స్లాబ్ పైన టార్పెంట్ షీట్ వేయించి నట్లయితే వర్షం నీరు లోపలికి రాకుండా నివారించవచ్చునని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి సూచించారు. శనివారం కూకట్ పల్లి లోని యుపిహెచ్ఎస్ సెంటర్ ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోజుకు ఎంత మంది ఓపి పేషెంట్లు వస్తున్నారని, వారి నమోదు ఏ విధంగా రిజిస్టర్ చేస్తున్నారని ఆన్ లైన్ పరిశీలించారు. మొదటిసారి వచ్చే వారికి రిజిస్ట్రేషన్ కోసం ఆధార్ నంబర్ తో నమోదు చేయడం జరుగుతుందని మెడికల్ ఆఫీసర్ మమత కలెక్టర్ కు వివరించారు. ఎఎన్ సి, బిపి, షుగర్ పరీక్షలు పేషెంట్లు క్రమం తప్పకుండా వస్తున్నారా అని.. సీజనల్ వ్యాధులపై ఫీవర్ సర్వే చేస్తున్నారా..! డెంగ్యూ పరీక్షలు ఏ విధంగా చేస్తున్నారని కలెక్టర్ మెడికల్ ఆఫీసర్ ను అడిగి తెలుసుకున్నారు. ఇంటికి వెళ్లి టెస్టులు చేస్తున్నామని, డెంగ్యూ ఉందని నిర్ధారణ అయితే వారి కుటుంబ సభ్యులందరికీ పరీక్షల నిర్వహిస్తున్నామని మెడికల్ ఆఫీసర్ కలెక్టర్ కు తెలిపారు. యూపీహెచ్ సీ వెనుక వైపు ప్రహరీ గోడ గేటు అవసరమని మెడికల్ ఆఫీసర్ కలెక్టర్ కు తెలిపారు. అవసరమైన మరమ్మత్తులకు సంబంధించిన ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రిలోని మెడిసిన్ రూమ్, ల్యాబ్ ఎక్స్ రే, సిటి స్కాన్ గదులను కలెక్టర్ పరిశీలించారు. ఈ పర్యటనలో కూకట్ పల్లి ఎమ్మార్వో స్వామి, మెడికల్ ఆఫీసర్ మమత సంబంధిత అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# సాయి ప్రియ కాలనీలో వనమహోత్సవం






**దమ్మాయిగూడ, జూలై 26, (తెలంగాణ దిశ) :**దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని సాయి ప్రియ కాలనీలో శనివారం వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో 1850 మొక్కలను ఇంటికి పంపిణీ చేశారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా స్థానికులకు డెంగ్యూ మలేరియా లాంటి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అదేవిధంగా ఇంటింటికి తడి పొడి చెత్తలను వేరు చేయడం, గృహ కాంపోస్టింగ్ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకట్ రెడ్డి, డిఈఈ బాల మురళి, ఎస్. మున్సిపల్ మేనేజర్ ఎ. వెంకటేశం, సానిటరీ ఇన్ స్పెక్టర్ ప్రభు, వార్డు ఆఫీసర్స్ కార్యాలయ సిబ్బంది, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై జవహర్ నగర్ పిఎస్ లో ఫిర్యాదు

**దమ్మాయిగూడ, జూలై 26, (తెలంగాణ దిశ) :** ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పై యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి పై అసభ్యకరంగా మాట్లాడిన కౌశిక్ రెడ్డి పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యువజన కాంగ్రెస్ దమ్మాయిగూడ మున్సిపల్ అధ్యక్షుడు కందాడి శ్రవణ్ రెడ్డి, జవహర్ నగర్ మునిసిపాలిటీ అధ్యక్షుడు వినయ్, మేడ్చల్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు కవాడి రాజేష్, వైస్ ప్రెసిడెంట్ బి. వంశీ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవాన్ని కించపరిచేలా ఉండటంతో, తగినచర్యలు తీసుకోవాలని యువ కాంగ్రెస్ నేతలుహా డిమాండ్‌హాచేశారు.



# ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు

**దమ్మాయిగూడ, జూలై 26, (తెలంగాణ దిశ) :** బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిపై చేసిన అసభ్యకర వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు శనివారం జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పార్టీ దమ్మాయిగూడ మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ సామల శ్రీనివాస్ రెడ్డి, యువజన కాంగ్రెస్ దమ్మాయిగూడ మాజీ అధ్యక్షులు సోమేశ్, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు జగపతిరావు, కిషన్ రావు, గోపిరెడ్డిలతో కలిసి స్టేషన్ సిఐ సైదయ్య, సబ్ ఇన్ స్పెక్టర్ ఇద్రిస్ అలీలకు ఈ మేరకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవాన్ని కించపరిచేలా ఉండడంతో తగిన చర్యలు తీసుకోవాలని సామల శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు.



# సంపాదకీయం

## దారి తప్పుతున్న భాష వాదం

భారతదేశం బహుభాషా సంస్కృతికి నిలయం. ప్రతి భాషకు దానిదైన చరిత్ర, సంస్కృతి, అస్తిత్వం ఉన్నాయి. అయితే, కొన్ని దశాబ్దాలుగా భారతదేశంలో భాషా వివాదాలు, ముఖ్యంగా హిందీని ఇతర భాషలపై రుద్దే ప్రయత్నంపై తలెత్తుతున్న ఆందోళనలు నిత్యకృత్యంగా మారాయి. భాషా వివాదాలు భారతదేశానికి కొత్తేమీ కాదు. అయితే, దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో, ఐక్యత, సమగ్రత అత్యవసరమైన ఈ సమయంలో భాష పేరుతో జరుగుతున్న హింస, విభేదాలు సమాజానికి ఏమాత్రం శ్రేయస్కరం కాదు. ఒక భాషను బలవంతంగా రుద్దే ప్రయత్నం చేయడం వల్ల అది సామాజిక అశాంతికి దారితీస్తుంది. భారతదేశంలో భాషా వైవిధ్యాన్ని గౌరవించడం, అన్ని మాతృభాషలకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం అత్యవసరం. విద్యార్థులు తమ మాతృభాషలో ప్రాథమిక విద్యను అభ్యసించడం, ఆ తర్వాత ఇతర భాషలను నేర్చుకోవడానికి ప్రోత్సాహం అందించడం సరైన పద్ధతి. హిందీకి దానిదైన ప్రాధాన్యం ఉండవచ్చు. కానీ, అది ఇతర భాషలపై ఆధిపత్యం చెలాయించే ప్రయత్నం చేయకూడదు. అభివృద్ధి అనేది కేవలం ఒక భాష నేర్చుకోవడం వల్ల మాత్రమే రాదు. అది విద్య, నైపుణ్యాలు, ఆర్థిక అవకాశాలు, సామాజిక సమానత్వం, మౌలిక సదుపాయాలు వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. దేశంలోనే ధనిక రాష్ట్రమైన మహారాష్ట్రలో ప్రస్తుతం భాష, అస్తిత్వం పేరుతో జరుగుతున్న ఆందోళనలు ఈ సమస్య ఎంత లోతుగా పాతుకుపోయిందో స్పష్టం చేస్తున్నాయి. ఒకవైపు ఆర్థికంగా బలంగా ఉన్న రాష్ట్రంలో భాష పేరుతో హింసాత్మక సంఘటనలు జరుగుతుండడం, మరోవైపు రాజకీయ నాయకుల వ్యాఖ్యలు ఈ వివాదానికి మరింత ఆజ్యం పోస్తున్నాయి. మహారాష్ట్రలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో మరాఠీని రాష్ట్ర భాషగా, ఇంగ్లిష్‌ను రెండో భాషగా, హిందీని మూడో భాషగా తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఆదేశాలివ్వడంతో గత ఏప్రిల్ నెల నుంచి ఆందోళనలు తీవ్రమయ్యాయి. ఈ నిర్ణయం సమాఖ్య విధానానికి అనుగుణంగానే తీసుకున్నామని మహారాష్ట్ర ప్రభుత్వం సమర్థించుకుంది. నిజానికి, భారత విద్యావ్యవస్థకు ప్రోత్సాహం, క్రమబద్ధీకరణ లక్ష్యాలతో ప్రభుత్వం 1968లో జాతీయ విద్యావిధానాన్నిఅమల్లోకి తెచ్చింది. అవసరాన్ని బట్టి దానిని మార్పులు చేస్తోంది. ప్రస్తుతం ఆందోళనలకు కారణమైన త్రిభాషా విధానాన్ని ఐదేండ్ల కిందటే కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీన్ని దశలవారీగా అమలుచేస్తున్నప్పటికీ, ఇది వివాదాస్పదంగా మారి, గతంలోనూ పలు ఆందోళనలకు దారితీసింది. మహారాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సివిల్ సొసైటీ గ్రూపులు, భాషాభిమానులు, ప్రతిపక్ష నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఉత్తర, మధ్య భారత రాష్ట్రాల్లో ప్రధానంగా మాట్లాడే హిందీ భాషను మహారాష్ట్ర ప్రజలపై బలవంతంగా రుద్దేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తున్నారు. స్వాతంత్ర్యం తర్వాత భాషాప్రయుక్త రాష్ట్రాలను ఏర్పాటు చేయడంతో మహారాష్ట్ర సహా చాలా రాష్ట్రాల్లో భాష అన్నది సున్నితమైన అంశంగా మారింది. గత ఏడాది, ఇండియా సిలికాన్ వ్యాలీగా పేరొందిన బెంగళూరులో కన్నడ భాషాభిమానులు ఆందోళనలు నిర్వహించారు. కంపెనీలు, షాపుల పేర్లను కేవలం ఇంగ్లిష్‌లోనే గాకుండా స్థానిక భాషలోనూ రాయాలనేది వారి డిమాండ్. ఈ సంఘటనలు భాషా అస్తిత్వ పోరాటాలు కేవలం మహారాష్ట్రకే పరిమితం కాదని స్పష్టం చేస్తున్నాయి. హిందీకి ప్రోత్సాహంపై అనుమానాలు. భారత్‌లో అత్యధికంగా మాట్లాడే భాష హిందీ. హిందీని ప్రోత్సహించడానికి కొన్నేండ్లుగా వివిధ ప్రభుత్వాలు పలు చర్యలు చేపట్టాయి. ఇది స్థానిక సంస్కృతిని దెబ్బతీస్తుందనే సందేహాలు వెల్లువెత్తాయి. హిందీ భాషను సమాజంపై బలవంతంగా రుద్దుతున్నారనే ఆరోపణలు రావడానికి అనేక కారణాలున్నాయి. మొదటగా, జాతీయ భాష అనే నినాదం. రాజ్యాంగం ప్రకారం భారతదేశానికి జాతీయ భాష అంటూ ఏదీ లేదు. హిందీ కేవలం అధికార భాష మాత్రమే. అయినప్పటికీ, హిందీని జాతీయ భాషగా ప్రచారం చేయాలనే తపన హిందీయేతర రాష్ట్రాలలో ఆందోళన కలిగిస్తోంది. 'ఒకే దేశం – ఒకే భాష'. ప్రభుత్వ విధానాలు. కేంద్ర ప్రభుత్వ సంస్థలు, బ్యాంకులు, రైల్వేలు వంటి వాటిలో హిందీ వినియోగాన్ని పెంచడం, హిందీలో శిక్షణను తప్పనిసరి చేయడం, ఉద్యోగాలలో హిందీ పరిజ్ఞానానికి ప్రాధాన్యం ఇవ్వడం వంటి చర్యలు హిందీయేతర ప్రజలకు అసమానతలకు దారితీస్తాయని భావిస్తున్నారు. మూడోది, రాజకీయ ప్రకటనలు. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ తరహా ఆందోళనలు పెరిగాయి. హిందీ మాట్లాడే రాష్ట్రాల్లోని బీజేపీకి చెందిన నాయకులు తరచుగా హిందీకి ప్రాధాన్యాన్ని ఇస్తూ చేస్తున్న వ్యాఖ్యలు వివాదాస్పదమవుతున్నాయి. 'ఒకే దేశం – ఒకే భాష' అనే నినాదం భారతదేశ వైవిధ్యాన్ని విస్మరిస్తుందనే విమర్శ ఉంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హిందీ భాషను 'పెద్దమ్మ భాష'గా అభివర్ణించడం తీవ్ర చర్చకు దారితీసింది. ఆయన ఈ వ్యాఖ్యలు చేయడానికి కొన్ని కారణాలు ఉండవచ్చు. జాతీయ సమగ్రత దృక్పథం దీని వెనుక ఒక కారణం. భారతదేశంలో ఎక్కువ మంది ప్రజలు మాట్లాడే భాష హిందీ కాబట్టి, దేశవ్యాప్తంగా కమ్యూనికేషన్ కోసం హిందీ అవసరమని ఆయన భావించి ఉండవచ్చు. 'పెద్దమ్మ భాష'అనే పదం భాషకు ఒక గౌరవాన్ని ఆపాదించాలనే ప్రయత్నంగా కనిపించినప్పటికీ, అది ఇతర మాతృభాషల ప్రాముఖ్యాన్ని తగ్గించి చూసేవిధంగా ఉంది. మరాఠీ మాట్లాడనివారిపై దాడులు. ఏప్రిల్ నెలలో థానే జిల్లాకు చెందిన ఇద్దరు మహిళలపై మరాఠీలోనే మాట్లాడాలని పట్టుబట్టిన వ్యక్తి దాడికి పాల్పడటం, ముంబయిలో ఒక సెక్యూరిటీ గార్డుకు మరాఠీ తెలియదన్నందుకు స్థానిక ప్రతిపక్ష పార్టీ మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన (ఎంఎన్ఎస్) కార్యకర్తలు కొట్టారని ఆరోపించడం, మే నెలలో ఓ డెలివరీ ఏజెంట్ మరాఠీలో మాట్లాడలేదని ముంబయిలో ఓ జంట డబ్బులు చెల్లించడానికి నిరాకరించడం, తాజాగా మరాఠీలో మాట్లాడలేదని గత వారం ఓ దుకాణ యజమానిపై ఎంఎన్ఎస్ కార్యకర్తలుగా భావిస్తున్న కొంతమంది దాడి చేయడం వంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ ఆందోళనలు, తదనంతర పరిణామాలతో సామాజిక విభజనలు పెరిగాయి. అదే సమయంలో దాదాపు రెండు దశాబ్దాలుగా రాజకీయ వైరం నెరపిన ఇద్దరు నాయకులు తమ విభేదాలను పక్కనబెట్టి కలిసిపోయారు. వారిలో ఒకరు బాల్ థాకరే కుమారుడు కాగా, మరొకరు ఆయన సోదరుడి కొడుకు. స్థానిక ప్రతిపక్షం శివసేన (యూబీటీ) అధిపతి ఉద్ధవ్ థాకరే, ఎంఎన్ఎస్ పార్టీ నాయకుడు రాజ్ థాకరే హిందీ అమలును వ్యతిరేకిస్తూ గత వారం సంయుక్తంగా ర్యాలీ నిర్వహించడం ఈ భాషా రాజకీయాల తీవ్రతను తెలియజేస్తుంది. భాషా వైవిధ్యాన్ని గౌరవించాలి. పవన్ కల్యాణ్ వంటి నాయకులు భాషా విషయాలపై వ్యాఖ్యలు చేసేటప్పుడు, దాని సామాజిక, రాజకీయ, సాంస్కృతిక కోణాలను పూర్తిగా అవగాహన చేసుకొని మాట్లాడాల్సిన బాధ్యత ఉంది. భాషను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించడం మానేసి, భాషా వైవిధ్యాన్ని దేశ సంపదగా పరిగణించినప్పుడు మాత్రమే భారతదేశం నిజమైన ఐక్యతను, సమగ్రతను, సుస్థిరాభివృద్ధిని సాధించగలదు. త్రిభాషావిధానంపై మహారాష్ట్ర వెనకడుగు. త్రిభాషా విధానంపై మహారాష్ట్రలో ఉద్రిక్తతలు అధికమవ్వడంతో బీజేపీ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం వెనకడుగు వేసింది. తన నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది. ఈ త్రిభాషా విధానంపై పునఃపరిశీలనకు ఒక కమిటీని నియమించింది. కానీ, వివాదం ఇంకా సద్దుమణగలేదు. దేశంలోనే అత్యంత ధనిక నగరపాలక సంస్థ ముంబయి సిటీ సహా మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికలు చాలాకాలంగా వాయిదాపడుతూ వచ్చాయి. వాటి నిర్వహణకు సన్నద్ధమవుతున్న తరుణంలో ఈ భాషాపరమైన వివాదం రేగి, అధికార కూటమికి, ప్రతిపక్ష పార్టీలకు మధ్య రాజకీయ వేడిని రాజేసింది. పొలిటికల్ గేమ్స్ ఆడుతున్నారంటూ ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. ఈ భాషా వివాదం కేవలం రాజకీయ ప్రకటనలకే పరిమితం కాలేదు, హింసాత్మక సంఘటనలకు కూడా దారితీసింది. మరాఠీ మాట్లాడనివారిపై, మరాఠీయేతరులపై దాడులు జరుగుతున్నాయి.

# మహిళల ఆర్థికాభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు

## - అదనపు కలెక్టర్ రాధిక గుప్తా





**మేడ్చల్, కలెక్టరేట్, జూలై 26, (తెలంగాణ దిశ)** :స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని మేడ్చల్–మల్కాజిగిరి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రాధిక గుప్తా తెలిపారు. శనివారం తూముకుంట మున్సిపాలిటీ పరిధిలో మహిళ శక్తి గ్రూపుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్ స్టాళ్లను మునిసిపల్ కమిషనర్ జ్యోతితో కలిసి ఆమె సందర్శించారు. స్టాళ్లలో ఏర్పాటు చేసిన పలు వంటకాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థికంగా బలోపేతం చేయుటకు ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు అందిస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా మహిళా శక్తి గ్రూపులకు క్యాంటీన్లను ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్ కోట్లను ఆమె పంపిణీ చేశారు. వర్షాకాలంలో పారిశుద్ధ్య కార్మికులు వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఇంజనీర్లు స్వయం సహాయక సంఘాల సభ్యులు పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

# నోటీసులు ఇచ్చాం..., చర్యలు తీసుకుంటాం...

## కాప్రా సర్కిల్ లో అక్రమ నిర్మాణాలపై అధికారుల దోబూచులాట..




**కాప్రా, జూలై 26, (తెలంగాణ దిశ) :** "తాంబూలాలు ఇచ్చాం, తన్నుకు చావండి" అన్నట్టుంది కాప్రా సర్కిల్ అధికారుల పరిస్థితి. సర్కిల్ పరిధిలోని కాప్రా, ఏఎస్ రావునగర్, చర్లపల్లి, మీర్ పేట్ హెచ్ బి కాలనీ, మల్లాపూర్, నాచారం డివిజన్ లలో జరుగుతున్న అక్రమ కట్టడాల విషయంలో.. నోటీసులు ఇచ్చాం..., చర్యలు తీసుకుంటామని" చెప్పడమే కానీ..., చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. దీంతో గత కొంత కాలంగా సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణా లు పుట్టగొడు గుల్లా వెలుస్తున్నాయి. అనుమతులకు మించి అదనపు అంతస్తులు, పెంట్ హౌస్ లు నిర్మిస్తున్న పట్టించుకునే నాధుడే కరువయ్యారు. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా కిందిస్థా యి సిబ్బంది ఆడిందే ఆట పాడిందే పాట అన్న రీతిలో వ్యవహరి స్తున్నారు. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ విభాగంలో అధికారులు అందుబాటులో లేకపోవడం వల్ల అనేక అనర్థాలు జరుగుతున్నా యని సర్కిల్ ఉద్యోగులు చెబుతున్నారు. కేవలం ఒక ఏసిపి, ఇద్దరు న్యాక్ ఇంజనీర్లు, మరో ముగ్గురు చైన్ మెన్ లతో టౌన్ ప్లానింగ్ విభాగం పని చేస్తుంది. ఇందులో అడపా దడపా ఏసిపి, మరో టీపీఎస్ లు తరచూ సెలవులపై వెళ్లడంతో చైన్ మెన్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. అసలు అనుమతులు లేకుండానే అనేక అక్రమ కట్టడాలు జరుగుతున్నట్లు సాక్షాత్తు టౌన్ ప్లానింగ్ విభాగంలో ఉద్యోగులే చెబుతున్నారు. వీటిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు ఎందుకు వెనకడుగు వేస్తున్నారో అంత పట్టడం లేదు. అనేక ఫిర్యాదులు జిహెచ్ఎంసి కమిషనర్, జోనల్ కమిషనర్లకు అందుతున్న చర్యలు తీసుకోవడంలో వెనుకడుగు వేయడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదు. అక్రమ కట్టడాల పేరుతో సంబంధం లేని న్యాక్ ఇంజనీర్లను సస్పెండ్ చేసి చేతులు దులుపుకున్నారు. కొత్త సీసాలో పాత సారా అన్నట్లు మళ్లీ ఇద్దరు న్యాక్ ఇంజనీర్లను, మరో ముగ్గురు చైన్ మెన్లను సర్కిల్ కు కేటాయించారు. ప్రభుత్వ ఆదాయానికి లక్షలాది రూపాయల గండిపడుతున్న అధికారుల్లో చలనం కనిపించడం లేదు. ఇప్పటికైనా జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని కాప్రా సర్కిల్ పరిధిలో జరుగుతున్న అక్రమ కట్టడాలను నిరోధించాలని స్థానికులు కోరుతున్నారు.



# మహిళల ఆర్థిక సాధికారతతోనే అభివృద్ధి

## - కొంపల్లి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి



**కుత్బుల్లాపూర్, జూలై 26, (తెలంగాణ దిశ) :** మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని కొంపల్లి మున్సిపల్ కమిషనర్ ఎన్. కృష్ణారెడ్డి అన్నారు. శనివారం తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమ్యూనిటీ హాల్ లో ఏర్పాటు చేసిన మహిళా స్వయం సహాయక బృందాల ఉత్పత్తులను కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించారు. పట్టణ పరిధిలోని మహిళా సంఘ సభ్యులందరూ వారు తయారు చేసే ఉత్పత్తులను మేళాలో ప్రదర్శించాలని సూచించారు. రుణాలు పొందిన మహిళలు కంగన్‌హాల్స్, ఎంబ్రాయిడరీ వర్క్స్, టైలరింగ్, క్లాత్ స్టోర్స్ తదితర వ్యాపారాల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నారు. మహిళలు డిజిటల్, ఫైనాన్షియల్ లిటరీసీ, సాంకేతిక పరిజ్ఞానం నేర్చుకోవాలని, పోటీ ప్రపంచంలో భవిష్యత్ సాంకేతికతపై ఆధారపడి ఉంటుందన్నారు. ఆన్‌లైన్ పద్ధతుల ద్వారా ఇంటి వద్దనే చిరు వ్యాపారాలను కొనసాగించవచ్చునని, తద్వారా కుటుంబ అభివృద్ధిలో మహిళలు కీలక పాత్రను పోషించాలన్నారు. ఈ సందర్భంగా మహిళా స్వయం సహాయక సభ్యులకు, మున్సిపల్ సిబ్బందికి ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహిళలు, మున్సిపల్ సిబ్బందికి ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళా స్వయం సహాయక బృందాల సభ్యులు, మున్సిపల్ ఉద్యోగులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శ్రీకర హాస్పిటల్ డాక్టర్ శ్రీధర్ (యూరాలజీ ), డాక్టర్ శరత్ (జనరల్ ఫిజిషన్), డాక్టర్ సందీప్ రాజ్ (న్యూరోలాజి), డాక్టర్ సురేష్, కృష్ణ సాయి, అలాగే విజేత హాస్పిటల్ డాక్టర్ ప్రియదర్శిని (గైనకాలజిస్ట్) సురక్ష హాస్పిటల్ డాక్టర్ సౌమ్య, డాక్టర్ పూజిత (న్యూరోలాజీ), గౌతమ్ హాస్పిటల్ డాక్టర్ దీప్తి తదితరులు హాజరై మహిళలకు వివిధ పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ తిరుపతి, ఆర్ఐ రాజు, మెప్మా ఏడిఎంసీ ఉమేష్, పద్మావతి, సౌమ్య, సానిటరీ సూపర్ వైజర్ బి. జానీ, ఎన్విరాన్ మెంట్ ఇంజనీర్ రాఘవాచారి తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ఎస్ సీ, ఎస్ టీ, బీసీ మైనారిటీల అలాయ్ బలాయ్



**కుత్బుల్లాపూర్, జూలై 26, (తెలంగాణ దిశ)** :ఓల్డ్ బోయిన్ పల్లి లోని మల్లారెడ్డి గార్డెన్ లో ఎస్ సీ ఎస్ టీ బీసీ మైనారిటీల అలాయ్ బలాయ్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. మాధవరం కాంతారావు మిత్ర మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఎస్ సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం అలుపెరగని పోరాటం చేసిన యోధుడు బడుగు బలహీన పీడిత వర్గాల నాయకుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, బిజెపి మేడ్చల్ జిల్లా కన్వీనర్ డాక్టర్ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఈ కార్యక్రమానికి బిజెపి మేడ్చల్ రూరల్ జిల్లా ఉపాధ్యక్షురాలు, భౌరంపేట మాజీ సర్పంచ్ కొమ్ము మంగమ్మ హాజరై మందకృష్ణ మాదిగను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంగమ్మ మాట్లాడుతూ ఎస్ సీ, ఎస్ టీ, బీసీ మైనారిటీల అలాయ్ బలాయ్ కార్యక్రమానికి కుల మతాలకతీతంగా ప్రతి ఒకరు హాజరై విజయవంతం చేయడం అభినందనీయమన్నారు.

# కార్గిల్ దివాస్ సందర్భంగా 5కె రన్



**కుత్బుల్లాపూర్, జూలై 26, (తెలంగాణ దిశ)** :కార్గిల్ దివాస్ ను పురస్కరించుకొని శనివారం బిజెపి నాయకులు 5%ఎ% రన్ నిర్వహించారు. ఈ రన్ కార్యక్రమాన్ని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు జెండా ఊపి ప్రారంభించారు. బిజెపి కుత్బుల్లాపూర్ నియోజక వర్గ నాయకులు జెకె శేఖర్ యాదవ్, 129 డివిజన్ అధ్యక్షులు కేశవ్ యాదవ్ ఆధ్వర్యంలో కార్గిల్ దివస్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# కేటీఆర్ గదాను బహుకరించిన బిఆర్ఎస్ విద్యార్థి విభాగం నేతలు

ఉప్పల్ నియోజకవర్గంలోని మల్లాపూర్ డివిజన్ వివిఎస్ఆర్ గార్డెన్స్ లో శనివారం జరిగిన బిఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర స్థాయి సదస్సుకు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ నేత, శంభీపూర్ క్రిష్ణ, బీఆర్ఎస్ వి రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు కడారి స్వామి, పడాల సతీష్, కర్నే అరవింద్ తదితరుల ఆధ్వర్యంలో కేటీఆర్ కు గదా బహిష్కరించారు.

(కుత్బుల్లాపూర్, తెలంగాణ దిశ)

# పేరి సూత్రాలతోనే పోస్టులు...

**తిరుపతి, తెలంగాణ దిశ :**తెలుగుదేశం పార్టీ నామినేటెడ్ పోస్టు భర్తీ విషయంలో కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే కూటమి అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది కావస్తుండటంతో దిగువ స్థాయి నేతలు నామినేటెడ్ పదవుల కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. తాము పడిన కష్టానికి ఈసారైనా ప్రయోజనం ఉంటుందని భావిస్తున్నారు. ఇటు కూటమిలోని అన్ని పార్టీలూ నామినేటెడ్ పదవుల భర్తీ విషయంలో ఉత్కంఠగా ఎదురు చూస్తున్నాయి. ఇప్పటికే ఎమ్మెల్యేల నుంచి ముఖ్య నేతలు, కార్యకర్తల పేర్లను పంపాలని చంద్రబాబు నాయుడు సూచించడంతో వారు ఇప్పటికే అన్ని నియోజకవర్గాల నుంచి పేర్లు అయితే వచ్చాయి. పోటీ మాత్రం తీవ్రంగా ఉంది. ఎవరిని ఎంపిక చేయాలన్న దానిపై ఇంకా కసరత్తు కొనసాగుతుంది. నామినేటెడ్ పదవుల భర్తీ విషయంలో చంద్రబాబు అనేక సూత్రాలను పాటిస్తున్నారు. ప్రాంతాలు, కులాలు, పార్టీల వారీగా పేర్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం. ముఖ్యమైన, ప్రాధాన్యత కలిగిన పోస్టులకు గత ఎన్నికల్లో సీట్లు దక్కని వారి పేర్లను కూడా పరిశీలిస్తున్నారు. వారిని కొంత కాలం నామినేటెడ్ పదవుల్లో ఉంచితే కొంతలో కొంత ఎమ్మెల్సీ, రాజ్యసభ ఎన్నికల్లో పోటీ తగ్గుతుందని భావిస్తున్నారు. అందుకే మాజీ ఎమ్మెల్యేలను, గత ఎన్నికల్లో టిక్కెట్ రాని వారికి ముఖ్యమైన పోస్టుల్లో నియమించాలన్న ప్రతిపాదన ఒకటి ఆయన సీరియస్ గానే పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఇందుకోసం కొన్ని ముఖ్యమైన నేతలకు ఇప్పటికే ఫోన్లు చేసి సమాచారం అందించి వారి అభిప్రాయాలను కూడా తీసుకున్నట్లు చెబుతున్నారు. రెండు హామీల విధివిధానాలపై చర్చ ప్రధాన దేవాలయాల్లో... ముఖ్యంగా ప్రధాన దేవాలయాల్లో బాగా కష్టపడి పనిచేసిన నేతలకు, కార్యకర్తలకు ఇవ్వాలని చంద్రబాబు నిర్ణయించారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో పాలకమండలిని భర్తీ చేసే ఉద్దేశ్యంతో ఉన్న ఆయన ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులకు ముఖ్యమైన నేతలకు ఇవ్వాలని భావిస్తున్నారు. పోస్టులు తక్కువ, పేర్లు ఎక్కువగా ఉండటంతో మొదటి రెండు జాబితాల్లో రాని వారికి మలి జాబితాలో చోటు కల్పించాలని చూస్తున్నారు. ఎమ్మెల్యేల ప్రతిపాదనలతో పాటు తాను సొంతంగా నియోజకవర్గాల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుని ఆయన పేర్లను ఖరారు చేస్తుండటంతో పాటు లోకేశ్ సూచించిన వారికి కూడా కొంత ప్రాధాన్యత దక్కే అవకాశాలున్నాయి.

### పిల్లలకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా

# తగు జాగ్రత్తలు తీసుకోవాలి

## - అదనపు కలెక్టర్ రాధిక గుప్తా



**మేడ్చల్ కలెక్టరేట్, జూలై 26, (తెలంగాణ దిశ) :** పిల్లలకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రాధిక గుప్తా సూచించారు. శనివారం షామీర్ పేట్ లోని మండల ప్రజా పరిషత్ పాఠశాలను తూముకుంట మునిసిపల్ కమిషనర్ జ్యోతి, ఇంచార్జీ డిడబ్ల్యూ శారదలతో కలిసి ఆమె సందర్శించారు. పాఠశాలకు విద్యార్థుల హాజరవుతున్న తీరుతెన్నూలతోపాటు విద్యా బోధన విధానాలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పిల్లలతో ఆమె ముచ్చటించారు. భారీగా వర్షాలు కురుస్తున్నందు వల్ల వ్యాధులు ప్రబలకుండా పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించుటకు రాజీ పడద్దని వారికి సూచించారు. పాఠశాల గదులను, వంటగదిని, పాఠశాల పరిసరాలను కలియ తిరిగి ఆమె పరిశీలించారు. పాఠశాలకు పలు మరమ్మత్తులు చేయాలని ఉపాధ్యాయులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా , మరమ్మత్తులకు కావలసిన నిధుల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులకు సూచించారు. అలాగే పాఠశాల పరిసరాలలో అంగన్ వాడి కేంద్రం నిర్వహణకు ఒక గదిని కేటాయించాలని అదనపు కలెక్టర్ విద్యాశాఖ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మంత్రుల పనితీరుపై నివేదికలు!

**హైదరాబాద్, తెలంగాణ దిశ :** ఏడాది పాలన పూర్తి చేసుకున్న సీఎం రేవంత్ రెడ్డి.. ఇక నుంచి ప్రతి అంశంపై పట్టు సాధించే యోచనలో ఉన్నారు. అటు అధికారులు..ఇటు క్యాబినెట్ సహచరుల పనితీరు మీద ఇప్పటికే ఇంటెలిజెన్స్ రిపోర్ట్ తెప్పించుకున్న సీఎం మార్పులు, చేర్పులు చేయాలని భావిస్తున్నారట. తన దూకుడుకు తగ్గట్లుగా పనిచేయని అధికారుల తీరుపై ఇప్పటికే అసంతృప్తి వ్యక్తం చేశారట.త్వరలోనే కొందరు ఉన్నతస్థాయి అధికారుల బదిలీలు కూడా ఉంటాయని అంటున్నారు. అంతేకాదు ఏడాది పాలనలో అమాత్యుల పనితీరు ఎలా ఉందని కూడా రేవంత్ ఆరా తీసినట్లు తెలుస్తోంది. పలువురు మంత్రుల పనితీరుపై ప్రజల్లో నెగెటివ్ టాక్ ఉందని సీఎం దృష్టికి వచ్చిందంటున్నారు. ఒకరిద్దరు మంత్రుల అవినీతి ఆరోపణల వ్యవహారం ముఖ్యమంత్రి దగ్గరకు వెళ్లిందట.ఆయా శాఖల్లో మంత్రులు సాధించిన విజయాలు, ఫెయిల్యూర్స్‌పై ముఖ్యమంత్రి కార్యాలయం రిపోర్ట్ తయారు చేసిందని సచివాలయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కొందరు మంత్రుల పనితీరుపై సీఎం రేవంత్ రెడ్డి అసంతృప్తితో ఉన్నారని తెలుస్తోంది. పలువురు మినిస్టర్ల అవినీతి భాగోతంపై సీరియస్‌గా ఉన్న ముఖ్యమంత్రి..మంత్రివర్గ విస్తరణలో వారి శాఖలను మార్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా ఇద్దరు ముగ్గురు మంత్రులు పెద్దఎత్తున అవినీతికి పాల్పడుతున్నారని ఇంటెలిజెన్స్ అధికారులు సీఎంకు రిపోర్టు ఇచ్చారట.ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి టేబుల్ మీద ఉన్న ఐబీ నివేదికలో మంత్రుల అక్రమాలు, అవినీతికి సంబంధించిన వివరాలు ఉన్నట్లు సచివాలయ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలోనే ఆయా మంత్రులపై ఎటువంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై రేవంత్ సమాలోచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అక్రమాలకు పాల్పడుతూ..అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న మంత్రుల అంశాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి సిద్ధమవుతున్నారని టాక్.త్వరలో మంత్రివర్గ విస్తరణ జరగనుంది. ఆరు బెర్తులను భర్తీ చేయబోతున్నారు. అదే సమయంలో పనితీరు సరిగా లేని మంత్రుల శాఖలను మార్చే అవకాశం ఉందంటున్నారు. కొందరిని అయితే తప్పించే అవకాశం కూడా లేకపోలేదన్న చర్చ జరుగుతోంది. దీంతో ఏ మంత్రి శాఖ మారబోతుంది..కరప్షన్ అలిగేషన్స్ ఎదుర్కొంటున్న అమాత్యులు ఎవరనే దానిపై సెక్రటేరియట్‌లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. కొందరు మంత్రుల మీద వచ్చిన నెగెటివ్ ఫీడ్ బ్యాక్‌ను అధిష్టానం దృష్టికి తీసుకెళ్లబోతున్నారట సీఎం రేవంత్. ఇవాళ్టితో ప్రజావిజయోత్సవాలు ముగియడంతో తర్వాత సెక్రటేరియట్‌లో పూర్తిస్థాయి ప్రక్షాళనకు రెడీ అవుతున్నారట సీఎం. అధికార యంత్రాంగాన్ని తన గ్రిప్‌లోకి తెచ్చుకుని పాలనను పరుగులు పెట్టించాలని ఫిక్స్ అయ్యారట. అందులో భాగంగా మంత్రుల పనితీరు, వాళ్ల మీద వస్తున్న ఆరోపణలపై ఓ కన్నేసి పెట్టారని అంటున్నారు.అయితే పబ్లిక్ నుంచి నెగెటివ్ ఫీడ్ బ్యాక్ వచ్చిన మంత్రులు, కరప్షన్ అలిగేషన్స్ ఉన్న మినిస్టర్ల విషయంలో ఎలాంటి స్టెప్ తీసుకోవాలనే దానిపై సన్నిహితులతో చర్చిస్తున్నారట సీఎం. ప్రజా విజయోత్సవాలు ముగిశాక.. హైకమాండ్ పెద్దల దృష్టికి తీసుకెళ్లి మార్పులు, చేర్పులకు శ్రీకారం చుడుతారని అంటున్నారు. ఏ మంత్రి శాఖ మారబోతుందో..అధిష్టానం ఏం నిర్ణయం తీసుకుంటుందో చూడాలి మరి.

# నకిలీ పోడు పట్టాల తయారీ ముఠా అరెస్టు

**ములుగు, తెలంగాణ దిశ :**నకిలీ పోడు పట్టా పాసుపుస్తకాలు తయారు చేసిన ఇద్దరిని అటవీ శాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి పోడు పట్టా పాసుపుస్తకాలు తయారు చేస్తున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించి ఎఫ్ఆర్‌వో డోలి శంకర్ తెలిపిన వివరాలు ఇలా.. ఈ నకిలీ పోడు పాసుపుస్తకాల వ్యవహారంలో ఏడుగురు వ్యక్తులు సూత్రధా రులుగా ఉన్నారు. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ముగ్దుంపురం గ్రామానికి చెందిన చాందావత్ భద్రు ములుగు మండలంలోని పలు మండలాల రైతుల నుంచి డబ్బులు తీసుకుని ఈ తతంగాన్ని నడిపించాడు. వరంగల్ నగరానికి చెందిన గణేష్ ప్రింటర్స్ యజమాని తాటిపాముల రాజు ఒక్కో పాసు పుస్తకానికి రూ. 2 వేలు తీసుకుని నకిలీ పుస్తకాలు తయారు చేసేవాడు. ఆన్‌లైన్ సెంటర్ నడుపుతున్న నర్సంపేటకు చెందిన భూక్య వెంకన్న క్యూఆర్‌కోడ్ సృష్టించాడు. మహబూబాబాద్‌కు చెందిన బానోత్ హరినాయక్ హోలోగ్రామ్ తయారు చేశాడు. నర్సంపేటకు చెందిన ధారావత్ కిషన్ బ్యాంకు రుణాల కోసం అటవీశాఖ రేంజ్ అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేసి క్లియరెన్స్ ధ్రువీకరణ పత్రాన్ని రూపొందిం చాడు. వెంకటాపూర్ మండలం
ఇంచెంచెర్వుపల్లి గ్రామానికి చెందిన జాటోత్ రాజ్‌కుమార్ (ఎఫ్ఆర్సీ ఛైర్‌పర్సన్) అటవీ హక్కు పత్రం పాసు పుస్తకం నమూనా పంపించాడు. ములుగు మండలం కాసిందేవ్‌పేట గ్రా మానికి చెందిన వాంకుడోత్ రవి ఏజెంటుగా వ్యవహరిస్తూ.. పాసు పుస్తకం కావాలన్న వారి దగ్గర డబ్బులు వసూలు చేసి వివరాలను భద్రుకి పంపించేవాడు. ఏడుగురు వ్యక్తులు ఈ దందాలో కీలకంగా వ్యవహరి స్తున్నారని, బ్యాంకులో రుణం పొందడానికి నకిలీ పోడు పట్టాల పుస్తకాలు తయారు చేసినట్లు విచారణలో తేలిందని ఎఫ్ఆర్‌వో తెలిపారు. మిగతా వారిని అదుపులోకి తీసుకుని విచారించిన నమోదు చేస్తామన్నారు.

# ప్రజలు స్వచ్ఛతపై దృష్టి సారించాలి

### కుషాయిగూడ పిహెచ్ సిని సందర్శించిన వైద్య విద్యా శాఖ సంచాలకులు డాక్టర్ నరేందర్ కుమార్





**కుషాయిగూడ, జూలై 26, (తెలంగాణ దిశ) :** ప్రజలు స్వచ్ఛతపై దృష్టి సారించాలని ఎలాంటి ఆరోగ్య సమస్యలున్నా వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాలను సంప్రదించాలని తెలంగాణ వైద్య విద్యా శాఖ సంచాలకులు డాక్టర్ నరేందర్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆరోగ్య రక్షణ దృష్ట్యా తీసుకుంటున్న వైద్య చర్యలలో పర్యవేక్షణలో భాగంగా మేడ్చల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సి. ఉమాగౌరీతో కలసి శనివారం కుషాయిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రస్తుత కాలానుగుణ వ్యాధుల పరిస్థితిని సమీక్షించారు. వైరల్ జ్వరాలు, డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధుల నివారణకు తీసుకుంటున్న చర్యలు, అవగాహన కార్యక్రమాలు, ల్యాబ్ సదుపాయాలు, మందుల నిల్వలు మొదలైన అంశాలపై సమీక్షించారు. సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా టెస్టులతో పాటు సిబిపి ఈఎస్ఆర్ చేస్తామని తెలిపారు. ప్రతిరోజు 10 నుంచి 15 వరకు జ్వరాల కేసులు నమోదు అవుతున్నాయని తెలిపారు. గత మూడు నెలల్లో 633 జ్వరాల కేసులు నమోదయ్యాయని తెలిపారు. గత మూడు నెలలలో 148 డెంగ్యూ, 156 మలేరియా, 63 చికెన్ గున్యా, 125 సిబిపి టెస్టులు చేసినట్లు వివరించారు. జూన్ నెలలో మూడు, జూలై నెలలో మరో మూడు డెంగ్యూ పాజిటివ్ కేసులు నమోదైనట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెక్టర్ బోర్న్ వ్యాధుల నియంత్రణ కార్యాక్రమాధికారి డాక్టర్ శ్రీదేవి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ రమాదేవి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి. సుప్రియా, నర్సింగ్ ఆఫీసర్లు కె. సుశీలా, పి. కవిత, ల్యాబ్ టెక్నీషియన్ షాల్కీ శివాజీ, ఎంపిహెచ్ఈఓ ఎంహెచ్ శ్యామ్ సుందర్, పిహెచ్ఎన్ పి. గీతా, ఫార్మసిస్ట్ జి. పద్మ తదితరులు పాల్గొన్నారు.

# కొలువుల గ్రంథాలయం

**సూర్యాపేట,తెలంగాణ దిశ:**సూర్యాపేట జిల్లాకేంద్ర గ్రంథాలయం కొలువులకునిలయంగా మారింది. వివిధ పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉండటంతో అభ్యర్థుల సన్నద్ధతకు ఉపయోగపడుతోంది. పట్టణ ప్రజలే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి అభ్యర్థులు వచ్చి చదువుకొని ఉద్యోగాలు సాధిస్తున్నారు. 400 మందికిపై సభ్యత్వాలు పొందగా.. రోజూ 300 పైగా యువకులు, విద్యార్థులు వస్తుంటారు. విశాలమైన గదు లతోపాటు, అన్ని రకాల వసతులు, వివిధ దినపత్రికలను అధికారులు సమ కూర్చుతున్నారు. ఈ గ్రంథాలయంలో 28 వేలకుపైగా పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ చదువుకున్న వారిలో చాలామంది పోలీసు, ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికవడం విశేషం. సూర్యాపేట గ్రంథాలయానికి వచ్చి చదువుకున్న వారిలో ఇటీవల వెల్లడైన డీఎస్సీఫలితాల్లో 25 మంది ఉద్యోగాలు సాధించారు. కొంతమంది మహి ళలకు వివాహాలు జరిగినా భర్తల ప్రోత్సాహంతో రోజూ వచ్చి చదు వుకొని తమ కొలువు కలను నెరవేర్చుకున్నారు. మాది నిరుపేద కుటుంబం. పెయింటింగ్ పని చేస్తూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నాను. మా నాన్న మరణంతో మా కుటుంబం దిక్కుతోచని స్థితిలోకి చేరుకుంది. క్రీడలపై మక్కువతో బీపీఈడీ, ఎంపీఈడీ పూర్తి చేసి 2017లో డీఎస్సీ



పరీక్ష రాశాను. కొన్ని మార్కుల తేడాతో ఉద్యోగం కోల్పోయాను. రోజూ పది గంటలు సూర్యాపేట గ్రంథాలయంలో చదువుకొని ఉద్యోగం సాధించాను. సూర్యాపేట మండలం సోలిపేట విధుల్లో చేరాను. మా అక్క ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నారు. ఆమెస్ఫూర్తితో ఎలాగైనా ఉపాధ్యాయ కొలువు సాధించాలనే పట్టుదలతో సూర్యాపేట గ్రంథాలయానికి వచ్చి చదువుకున్నాఇక్కడ మాకు కావాల్సిన పుస్తకాలు ఉన్నాయి. వాటిని రెండు నెలలుగా చదవడంతో ఉద్యోగం వచ్చేందుకు దోహదపడింది. కోదాడ మండలం గణపవరం ఎంపీపీఎస్ పాఠశాలలో విధుల్లో చేరాను.

# కులాంతరాలు లేని సమాజానికై ముందుకు సాగుదాం

**నల్గొండ,తెలంగాణ దిశ :**మనిషిని మనిషి ఇష్టపడి కలిసి జీవిస్తామనే చేసుకున్న ఒప్పందమే పెళ్లి అని మూఢనమ్మకాల నిర్మూలన సంఘం జాతీయ అధ్యక్షులు బైరి నరేష్ అన్నారు. నల్లగొండ పట్టణంలోని స్థానిక అంబేద్కర్ భవన్ లో కు లాంతర వివాహితుల సంక్షేమ సంఘం, సామాజిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెదవూర మండలం దళిత సామాజిక వర్గానికి చెందిన హరి ప్రసాద్, నకిరేకల్ నియోజకవర్గం బిసి సామాజిక వర్గానికి చెందిన రాజేశ్వరి ల వివాహం చేయడం జరిగింది. వీరిద్దరు పరస్పరం ఇష్టపడి కులాంతర వివాహితుల సంక్షేమ సంఘాన్ని ఆశ్రయించడంతో ఆదర్శ వివాహం చేయడం జరిగింది. ఈ కులాంతర వివాహానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బైరి నరేష్ మాట్లాడుతూ పెళ్లి అనే బంధం ఈ సమాజాన్ని ముంధుకు తీసుకుపోయే విధంగా ఉండాలని,సమాజానికి ప్రాథమిక మెట్టు కుటుంబం అన్నారు. వివాహ బంధాలను కు..లంతో ముడిపెట్టి మానవ సంబంధాలలో అంతరాలను సృష్టిస్తున్నారన్నారు. ఇలాంటి కులాంతర వివాహాల ద్వారానే కుల నిర్మూలన జరిగి సమసమానత్వం సాధ్యమైతుందని బాబాసాహెబ్ అంబేద్కర్ అన్న విషయాన్ని గుర్తు చేసారు. భారతదేశంలో కులం అన్ని రంగాలలో పట్టిపీడిస్తుందని వారన్నారు. మనువాదులు సృష్టించిన నిచ్చనమెట్ల కుల వ్యవస్థే ఈ దేశంలో పెద్ద జబ్బును సృష్టించిం దన్నారు. ఈ దేశంలో వివాహాలు ఆర్థికంతో ముడిపడి



ఉన్నాయని వాటికి ముగింపు పలకాల్సిన అవసరం ఉందన్నారు. కులాంతర వివాహాలు చేసుకు న్న జంటలపై ఆధిపత్య వర్గాల వారి దాడులు పెరిగిపోతున్నాయని అలాంటి వారికి రక్షణ కల్పించడంలో పాలనా వ్యవస్థలు వైఫల్యం చెందుతున్నాయన్నారు. ఈ సమాజంలో ఉన్న కులం, అంతరాలను, చాదస్థాలను చంపడానికి ఆదర్శ వివాహం చేసుకున్న జంట తమ ప్రయాణాన్ని కొనసాగించాలన్నారు. శాస్త్రీయమైన ఆలోచన విధానాల ద్వారానే సమాజంలో మార్పు తధ్యమన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్, పెరియార్ రామస్వామి, నారాయణ గురు లాంటి మహనీయులు అంతరాలు లేని సమాజాన్ని ఆకాంక్షించారని ఆ వైపుగా నడుచుకోవాలని వారన్నారు.

# ఎత్తిపోతలు వదిలేశారు.. అన్నదాతను ముంచేశారు..?

**సీతానగరం,తెలంగాణ దిశ :**ఉమ్మడి జిల్లాలో లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు, వందలాది గ్రామాలకు తాగునీరు అందించే ఎత్తిపోతలపై నిర్లక్ష్యం ఉందనడానికి నిదర్శనమే పుష్కర, పురుషోత్తపట్నం ప్రాజెక్టులు. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలో గోదావరి ఎడమ గట్టున గత ప్రభుత్వంలో సుమారు రూ. 2,356 కోట్లతో నిర్మాణాలు చేపట్టారు. ఏటా నిర్వహణ చేసేలా బడ్జెట్‌లో పెట్టి రూ. 2.5 కోట్లకు పైగా నిధులు ఇచ్చేది. వైకాపా ప్రభుత్వం వచ్చాక నిర్వహణకు ఇచ్చే నిధులకు మంగళం పాడేసింది. వదిలేయాలో తెలియని పరిస్థితుల్లో యంత్రాంగం ఉంది. తొలకరి వర్షాలు మొదలై ఖరీఫ్ సాగుకు సమాయత్తమవుతున్నా ఎత్తిపోతలు ప్రశ్నార్థకంగా మారాయంటున్నారు రైతులు. గత ఖరీఫ్ సీజన్లో పుష్కర ఎత్తిపోతల నుంచి సాగునీరు సరఫరా పూర్తిస్థాయిలో చేసేందుకు మోటార్లు, లీకేజీల పనులు పూర్తికాలేదు. పుష్కర నుంచి ఒక్కో పంపు ద్వారా 175 క్యూసెక్కుల నీటిని విడుదల చేసేలా 8పంపులు సామర్థ్యంతో పథకాలు ఉన్నాయి. నాలుగైదు పంపులు మాత్రమే పనిచేయడంతో అవసరమైన 1400 క్యూసెక్కులుదీంతో గుత్తేదారులకు రూ. 12 కోట్లకు పైగా బకాయి పేరుకుపోయింది. ఈ ఏడాది పుష్కర ఎత్తిపోతల పథకాల మరమ్మతులు, మోటార్ల బిగింపు, లీకేజీలు అరికట్టేలా రూ. 4.26 కోట్లకు పిలిచిన టెండర్లు అలాగే ఉండిపోయాయి. 8మోటార్లకు గానుఆరే పనిచేస్తున్నా యి. గొట్టాల ద్వారా సరఫరాఅయ్యే సాగునీరుకు 32చోట్లకుపైగా లీకేజీలుపడ్డాయి. పంపు హౌస్‌వెల్ వద్ద వేసిన ఇసుక మేటలకు పూడికతీ తపనులు లేవు. కాకినాడ జిల్లాలోని తుని వరకు 1.86 లక్షల ఎకరాల కుసాగునీరు అందించే పథకాలు గడిచిన ఐదేళ్లగా 1.36 లక్షల ఎకరాలకు నీరు అందించడం గగనంగా మారింది. పురుషోత్తపట్నం ఎత్తిపోతలపై పర్యావరణ అనుమ తులకు ఎన్జీటీ పరిహారం రూ. 2.48 కోట్లపై న్యాయస్థానంలో తీర్పు రిజర్వులో ఉంది. పథకం తిప్పాలో, వదిలేయాలో తెలియని పరిస్థితుల్లో యంత్రాంగం ఉంది

# ఉత్పత్తి వ్యయం.. సింగరేణిపై భారం



**భూపాలపల్లి, తెలంగాణ దిశ :**కేటీకే 5వ గని ఆవరణలో రవాణాకు సిద్ధంగా సింగరేణి బొగ్గు సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి వ్యయం రోజురోజుకు పెరుగుతోంది.. కోల్ ఇండియా సంస్థలైన మహానది కోల్‌ఫీల్డ్స్(ఒడిశా), వెస్టన్ కో ల్‌ఫీల్డ్స్(మహారాష్ట్ర) కన్నా సింగరేణి సంస్థలో ఉత్పత్తిచేసే బొగ్గు ధర అధి కంగా ఉంటోంది. రవాణా ఛార్జీల భారం కారణంగా రాష్ట్రంతో పాటు పలు దక్షిణాది విద్యుత్తు సంస్థలు సింగరేణిపైనే ఆధారపడుతున్నాయి. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోకుంటే భవిష్యత్తులో సింగరేణి మనుగడపై ప్రభావం పడొచ్చనే అభిప్రాయం సంబంధిత అధికారవర్గాల్లో వ్యక్తమవుతోంది. దీంతో పాటు గనుల్లోకి త్వరలో ప్రైవేటు సంస్థలు ప్రవేశించనున్న తరుణంలో సింగరేణికి మరింత పోటీ ఎదురుకానుంది. వచ్చే ఐదారేళ్లలో ఉత్పత్తి వ్యయాన్ని గణనీయంగా తగ్గించుకోక తప్పదనే వాదన వినిపిస్తోంది.. ప్రస్తుతం ఈ అంశం అన్ని కోల్‌బెల్ట్ ఏరియాల్లో చర్చనీయాంశంగా మారింది. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు బొగ్గు బ్లాకులను కట్టబెట్టే అంశం కార్మికుల అభద్రతాభావానికి కారణమవుతోంది.

# సర్కారు వైద్యం.. అందనంత దూరం!

**ఖమ్మం, తెలంగాణ దిశ:**ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో 2023లోని పరిస్థితులపై కేంద్ర వైద్యారోగ్య కుటుంబ సంక్షేమశాఖ ఇటీవల వెలువరించిన 'హెల్త్ డైనమిక్స్ ఆఫ్ ఇండియా' నివేదిక ఇదే విషయాన్ని స్పష్టం చేస్తోంది.వేధిస్తున్న సిబ్బంది కొరత భద్రాద్రి జిల్లాలో వైద్యులు, సిబ్బంది కలిపి 490 మంది విధులు నిర్వర్తించాల్సి ఉండగా 316 మంది పనిచేస్తున్నారు. ఆరు సీహెచ్‌సీల్లో స్పెషలిస్ట్ వైద్యుల కొరత వేధిస్తోంది. కొన్నిచోట్ల దంత వైద్యులు, గైనకాల జిస్టులతోనే నెట్టుకొస్తున్నారు. ఖమ్మం జిల్లాలో పీహెచ్‌సీలు-26, పట్టణ ఆరోగ్య కేంద్రాలు-4, ఆరోగ్య ఉపకేంద్రాలు-231 ఉన్నాయి. పీహెచ్‌సీల్లో 76 వైద్యుల పోస్టులకు 27, స్టాఫ్ నర్సులు 70 పోస్టులకు 12,ఎంపీహెచ్ డబ్ల్యూ(ఫిమేల్) 213 పోస్టులకు 45, ఎంపీహెచ్‌డబ్ల్యూ (మేల్) 147 పోస్టులకు 107 పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఫీల్డ్ వర్కర్స్ 45 పోస్టుల్లో 38 ఖాళీలే. వైద్యారోగ్య కుటుంబ సంక్షేమశాఖలో 662 పోస్టులకు 398 భర్తీకి నోచుకోలేదు.అనేకచోట్ల పీహెచ్‌సీలు, ఆరోగ్య ఉపకేంద్రాలు అద్దె భవనాల్లో అరకొర వసతులు మధ్య కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వం ఆరోగ్య ఉపకేంద్రాలను పల్లె, బస్తీ దవాఖానాలుగా మార్చినా ఆశించిన స్థాయిలో వైద్యమందటం లేదు. ఖమ్మం జిల్లాలో సత్తుపల్లి, పెనుబల్లి, మధిర, కల్లూరు, తిరుమలాయపాలెం, వైరా, నేలకొండపల్లిలో




సీహెచ్‌సీ లున్నాయి. సివిల్ సర్జన్లు 51మందికి 33మంది లేరు. డిప్యూటీ సివిల్ సర్జన్ పోస్టుల్లో 52కు 48, సివిల్ అసిస్టెంట్ సర్జన్లలో 154కు 113 పోస్టులు భర్తీచేయలేదు. స్టాఫ్ నర్సుల్లో 147కు 36మంది లేరు. హెడ్‌నర్సు పోస్టుల్లో 31కి 21 ఖాళీలున్నాయి. మిడ్‌వైఫరీ పదకొండు పోస్టులకు పదింటిని భర్తీ చేయాల్సి ఉంది. రేడియోగ్రాఫర్లు, ఫార్మసిస్టులు, ఫిజియో థెరపిస్టులు ఇలా అనేక విభాగాల్లో పోస్టులు ఖాళీగా ఉండటంతో రోగులకు ఆశించిన స్థాయిలో సేవలందటం లేదు.

### ప్రధానమంత్రి సురక్ష బీమాను

# ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**తోగుట, తెలంగాణ దిశ :**సోషల్ సెక్యూరిటీ స్కీమ్స్ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనను ప్రజలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీజీవీబీ మేనేజర్ జలందర్ అన్నారు. భారత ప్రభుత్వం ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదే శాల మేరకు మండలంలోని చందాపూ ర్ గ్రామంలో గ్రామస్థాయి జన సురక్ష కార్యక్రమం భాగంగా ప్రజలకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ సెక్యూ రిటీ స్కీమ్స్ ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. సంవ త్సరానికి రూ. 20 చెల్లించి ఏడాదికి రెండు లక్షల ప్రమాద బీమా పొందడానికి అవకాశం వుందన్నా రు. 18 సంవత్సరాల నుండి 70 సంవత్సరాల వరకు అర్హులు ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన 436 సంవత్సరానికి రూ. 436 చెల్లించి రెండు లక్షల జీవిత బీమా పొందవచ్చని తెలిపారు. 18 నుండి 50 సంవత్సరాల వారు అర్హులు ఫిషింగ్ కాల్స్ ద్వారా సేవింగ్ కాల్స్ ద్వారా ఆన్లైన్ ద్వారా జరిగే ఫ్రాడ్స్ పై అవగాహన కల్పించారు. బ్యాంకు నుంచి ఎలాంటి ఓటీపీలు సివివి



నెంబర్లు అడిగే అవకాశం ఉండదని సూచించారు. ఎలాంటి ఫోన్ కాల్స్ వచ్చిన వెంటనే 1930 కి కాల్ చేసి తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీ సర్ భరత్ కుమార్, మాజీ సర్పంచ్ బొడ్డు నర సింహులు, బ్యాంకు మిత్ర కుమార్, ఆర్థిక అక్షరా స్యత కేంద్రం కౌన్సిలర్ ఎనుముల శ్రీనివాస్, గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

# ప్రత్యేక శిబిరాలు పెట్టి ఏంలాభం?



**చీరాల, తెలంగాణ దిశ :**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆధార్ కార్డు ఎంతో కీలకమైంది. ఆధార్ నవీకరణకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో లక్షల మంది ఇంకా దూరంగా ఉన్నారు. మంగళవారం నుంచి శుక్రవారం వరకు జిల్లాలో ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలాల్లో ఎంపీడీవోలు, పట్టణాల్లో పుర కమిషనర్లకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినా ఆధార్ నవీకరణ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. గంటలు తరబడి వేచి ఉన్నా.. సర్వర్ మొరాయించడంతో తిప్పలు తప్పడం లేదు. జిల్లాలోని 96 సచివాలయాల్లో ఆధార్ ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయగా.. ప్రస్తుతం 64చోట్లే పని చేస్తున్నాయి. మార్పులు చేర్పులు చేయడానికి అక్కడి డిజిటల్ సహాయకులకు ప్రత్యేక శిక్షణ సైతం అందించారు. చీరాల మండలం గవినివారిపాలెంలో ఉదయం కంప్యూటర్ ఆన్ చేయగా.. సాయంత్రం 4 వరకు పని చేయకపోవడం విశేషం. జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి ఎదురుకావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వెంటనే సాంకేతిక సిబ్బంది సాయం తీసుకుని కొన్నిచోట్ల సరిచేశారు. మరికొన్ని చోట్ల మాత్రం సమస్య కొనసాగింది. తొలి రోజు అతికష్టం మీద 1170 దరఖాస్తులను పరిష్కరించినట్లు చెబుతున్నారు. రెండోరోజు గురువారం ఆన్‌లైన్ అవాంతరాలు కొనసాగడంతో ఈ సంఖ్య 633కి పడిపోయింది. జిల్లా వ్యాప్తంగా కొన్ని ఇబ్బందులు తమ దృష్టికి వచ్చినట్లు వార్డు, గ్రామ సచివాలయాల జిల్లా అధికారిణి సువార్త పేర్కొన్నారు. సమస్యలు ఎదురైతే ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామన్నారు.

# రెవెన్యూ అధికారులు పనితీరు మెరుగుపర్చుకోవాలి : కలెక్టర్

**రాజంపేట, తెలంగాణ దిశ :**రెవెన్యూ అధికారులు తమ పనితీరు మెరుగుపర చుకొని శాఖ ప్రతిష్టను పెంచేందుకు బాధ్యతాయుతంగా కృషి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని స్థానిక కళాంజలి కల్యాణమండపంలో సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియాదేవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాజంపేట డివిజన్ తహశీల్దార్‌లు, డిటిలు, సీనియర్ అసిస్టెంట్లు, మండల సర్వేయర్లు విఆర్ఒలు, విఆర్ఎలతో రెవెన్యూ అంశాలపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి కార్యాలయం, సిసిఎల్ఎ కార్యాలయం, పిజిఆర్ఎస్ ద్వారా వచ్చిన ఫిర్యాదులు, వాటి పరిష్కారం, డివిజన్ లో ఫ్రీ హోల్డ్ రిజిస్ట్రేషన్ల పరిశీలన, హైకోర్టు, ఆర్‌టిఐ, జాతీయ మానవ హక్కులు, లోకాయుక్త కమిషన్ కేసుల గురించి చర్చించారు. అభివృద్ధి కార్యక్రమాలలో భూసే కరణ, అలియనేషన్ ప్రతిపాదనలు, నాలా కేసులు, డివిజన్ స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ తీర్మానాలు వాటి అమలు, ఓటరు జాబితా సవరణ తదితర అంశాలలో కలెక్టర్ సమ గ్రంగా సమీక్షించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవిన్యూ సేవలలో వేగం, నాణ్యత, పారదర్శకత ముఖ్యమన్నారు. పనితీరులో ప్రమాణాలు పెంచుకోవాలన్నారు. ప్రజలతో కలిసి మెలిసి మమేకం కావాలని, చట్ట ప్రకారం మార్గదర్శకాలు మేరకు పని చేయాలని సూచించారు. ఏలాంటి సమస్య అయినా కాలాతీతం చేయకుండా వేగంగా స్పందించి చట్టప్రకారం చర్యలు చేపట్టి నాణ్యతగా పరిష్కరించడమే మన ధ్యేయం కావాలని తెలిపారు. పిజిఆర్ఎస్ ద్వారా అందిన దరఖాస్తులలో మొత్తం వచ్చిన దరఖాస్తులు ఎన్ని, పరిష్కరించినవి ఎన్ని, ప్రగతిలో ఉన్నవి ఎన్ని, పెండింగ్ లో ఎన్ని ఉన్నాయి, ఎస్ఎల్ఎ పరిధిలో ఉన్న దరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్ఎ దరఖాస్తుల పై సమీక్షించారు. పిజిఆర్ఎస్ సిఎంకు అత్యంత ముఖ్యమైనదని, ప్రతి వారం పిజిఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం పై ముఖ్యమంత్రి కార్యాలయం సమీక్ష చేస్తోందని తెలిపారు. రాజంపేట డివిజన్ లో ఫ్రీ హోల్డ్ రిజిస్ట్రేషన్ భూముల




పరిశీలనను సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో బాగా నిర్వహించారని అన్నారు. కోర్టు కేసులు లోకాయుక్త, జాతీయ మానవ హక్కుల కమిషన్ కేసులపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. బదిలీ అయిన విఆర్ఒలను వెంటనే రిలీవ్ చేయాలని తహశీల్దార్లకు సూచించారు. బదిలీ అయిన ప్రదేశంలో విర్ఒలు విధుల్లో చేరాలని, విధుల్లో చేరని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జెసి ఆదర్శ రాజేంద్రన్ మాట్లాడుతూ ఆయా అంశాల్లో తహశీల్దార్లు తమ పరిధిలో సమస్యల పరిష్కారానికి బాధ్యతాయుతంగా కృషి చేయాలని చెప్పారు. వలస కార్మికులకు రేషన్ కార్డులు జారీ చేయాలని ప్రభుత్వం సర్కులర్ జారీ చేసిందని ఈ మేరకు నిబంధనలను అవగాహన కల్పించుకొని మండల వారీగా పారదర్శకంగా విచారణ చేసి%ా% సిఎస్‌డిటి, డిఎస్ఒలతో సంప్రదించి రేషన్ కార్డులు జారీ చేయాల్సిన జాబితాను రూపొందించాలని పేర్కొన్నారు. సమావేశంలో రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియాదేవి, సర్వే శాఖ జిల్లా అధికారి భరత్ ్నమార్, డిఎసఒ, తహసిల్దార్లు, డిటిలు, సీనియర్ అసిస్టెంట్లు, మండల సర్వేయర్లు, విఆర్ఒలు, విఆర్ఎలు, కలెక్టరేట్ వివిధ విభాగాల సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

# 'సూపర్‌సిక్స్'పై శ్రద్ధ పెట్టండి : సిపిఎం



**కడప, తెలంగాణ దిశ :** టిడిపి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలుపై శ్రద్ధ పెట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యా లయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలలో రైతులకు పెట్టుబడి సహాయం రూ.20 వేలు, అమ్మకు వందనం, విద్యార్థుల ఫీజు రియంబర్స్‌మెంట్, దీపం పథకం కింద ఇస్తున్న మూడు సిలిండర్ల కూడా స్పష్టత లేదని తెలిపారు. ప్రభుత్వం ఇస్తున్న ఉచిత ఇసుక విధానంలో కూడా ఆచరణలో చాలా గందరగోళం ఉందని, ఎన్నికల ముందు నాణ్యమైన విద్యుత్ ఇస్తామని, ఛార్జీల భారం వెయ్యమని చెప్పి అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం ట్రూ ఆప్ ఛార్జీల పేరుతో వేల కోట్ల రూపాయలు ప్రజల పైన విద్యుత్ భారాలు వేస్తుందని విమర్శించారు. గతంలో వైసిపి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలం చెందారని, ఇప్పుడు బాబు కూడా అదే బాటలోనే పయనిస్తున్నారన్న విషయాన్ని ప్రజల గమనిస్తున్నారని తెలిపారు. కడప ఉక్కు పరిశ్రమ కోసం గతంలో దీక్షలు చేసిన తెలుగుదేశం పార్టీ నాయకులు కేంద్రంలో ఎన్‌డిఎలో భాగస్వామ్యం అయినా కూడా వెనుకబడిన ప్రాంతాలకు నిధులు, పరిశ్రమలు తీసుకురావడంలో ఏమాత్రం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం సిపిఎం జిల్లా మహాసభలు డిసెంబర్ 14,15 తేదీలలో నగరంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని చెప్పారు. మహాసభలలో జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం, పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తి కోసం, వెనుకబడిన ప్రాంతాలకు నిధులు, నికర జలాలు, పరిశ్రమల కోసం జిల్లా మహాసభలలో చర్చించి, భవిష్యత్ కార్యచరణ రూపొందిస్తామని తెలిపారు. మహాసభల సందర్భంగా ర్యాలీ, ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర కమిటీ నాయకులు పాల్గొంటారన్నారు. జిల్లా మహాసభలు జయప్రదానికి సహాయ, సహకారాలు అందించాలని ప్రజానీకానికి పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎ.రామ్మోహన్ జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరి రెడ్డి పాల్గొన్నారు.

## అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే

**కడప, తెలంగాణ దిశ :** కడప నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని కడప ఎమ్మెల్యే మాధవి అన్నారు. నగరంలోని సంజన్న సర్కిల్ నుంచి మాసాపేట రోడ్డు వరకు నూతనంగా నిర్మించిన బిటి రోడ్డును టిడిపి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ వివేకానంద రెడ్డి ఎమ్మెల్యే మాధవిని, శ్రీనివాసరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మాటలు చెప్పి చేతల్లో చూపలేకపోయిందని విమర్శించారు.



# సాగునీటి సమస్యలకు చెక్!

**ధర్మపురి, తెలంగాణ దిశ :**ఏళ్ల తరబడి సాగునీటి రంగంలో క్షేత్రస్థాయి సిబ్బంది లేక చివరి ఆయకట్టుకు నీరందించడం గగనంగా మారింది. దీనికి రాష్ట్ర ప్రభుత్వంచెక్ పెట్టాలని భావిస్తోంది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చేసిన ప్రకటనతో అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఓ వైపు జిల్లాలో గోదావరి ఎత్తిపోతల పథకాలు, రోళ్లవాగు ప్రాజెక్టు, అక్కపల్లి చెరువు రిజర్వాయర్, బోలిచెరువు, జంగనాల ప్రాజెక్టు, యశ్వంతరావుపేట ప్రాజెక్టు లాంటివి ఉండటం.. మరోవైపు డీ–53, డీ–86 ప్రధాన కాలువలు ఉన్నాయి. వీటి కింద లక్ష ఎకరాల వరకు ఆయకట్టు ఉంది. కాలువల ద్వారా నీటిని వదిలిన సమయంలో అవి పూడికతో, పిచ్చి మొక్కలతో నిండిపోవడంతో ఏటా చివరి ఆయకట్టుకు నీరందడం లేదు. గోదావరి ఎత్తిపోతల పథకాలు నూతనంగా నిర్మించడంతో వీటి కింద 20 వేల ఆయకట్టు పెరిగింది. ఈ పథకాలకు క్షేత్రస్థాయి సహాయ సిబ్బంది లేక నిర్వహణకు తీవ్ర సమస్యలు ఎదురవుతున్నాయి. గోదావరికి వరదలు వచ్చినప్పుడల్లా రైతులు సమష్టిగా పథకాలను బాగు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో నూతన నియామక ప్రక్రియ రైతులకు దోహద పడనుంది. గోదావరి ఎత్తిపోతల పథకాలు, రిజర్వాయర్లకు ఎంతమంది ఎలక్ట్రిషియన్లు, ఫిట్టర్లు, పంపు మెకానిక్‌లు అవసరమో ప్రతిపాదించాలని ప్రభుత్వం ఇటీవల ఇరిగేషన్ అధికారులకు లేఖలు ఆ శాఖ ప్రధాన కార్యదర్శి ద్వారా పంపించింది. క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలన చేసి నివేదికలను ప్రభుత్వానికి పంపించారు. జిల్లాలో అన్ని పథకాలకు కలిపి 120 మంది వరకు అవసరం ఉంటారని నివేదించారు. ప్రభుత్వం 22 జులై 2016న



నీటిపారుదల శాఖ జారీ చేసిన మార్గదర్శకాలను పరిగణలోకి తీసుకుంటే ప్రధాన కాలువపై ప్రతి 9 కి.మీ.కి ఒకరు, ఉప కాలువపై ప్రతి 112 కి.మీల వరకు మరొకరు, డిస్ట్రిబ్యూటర్‌పై ప్రతి 2,500 ఎకరాల ఆయకట్టుకు లస్కర్లు ఉండాల్సి ఉండగా అమలు కావడం లేదు. ఈ క్రమంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చేసిన ప్రకటన, ప్రభుత్వం ప్రతిపాదనలను కోరడం నీటి పారుదల నిర్వహణలో నెలకొన్న దశాబ్దాల సమస్యలు పరిష్కారమవుతాయని భావిస్తున్నారు. సాగునీటి రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం ప్రణాళికలు వేస్తుంది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా కొత్తగా లస్కర్లు, సహాయకుల నియామక ప్రక్రియకు సబంధించిన ప్రతిపాదలను ప్రభుత్వానికి నివేదించాం. వీరిని నియమిస్తే సాగునీటి సరఫరా సమస్యలు చాలా వరకు తగ్గే అవకాశముంది.

### చెత్త సేకరణ వాహనాల

# వినియోగంలో బల్దియా నిర్లక్ష్యం



**జగిత్యాల, తెలంగాణ దిశ :**జగిత్యాల పట్టణంలో 48 వార్డుల నుంచి నిత్యం 70 మెట్రిక్ టన్నుల చెత్త సేకరిస్తున్నారు. వార్డుల విలీనం తరువాత గృహాల సంఖ్య పెరగటం, కాలనీలను విస్తరించడంతో చెత్త సేకరణ బల్దియాకు సవాలుగా మారింది. వాహనాల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఆటోలు, ట్రాక్టర్లు తరచూ మరమ్మతుకు గురవుతున్నాయి. దీంతో బల్దియా 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.14 లక్షలతో ఏడాది క్రితం ట్రాక్టరును.. రెండు నెలల కింద రూ.25 లక్షలతో 4 కొత్త ఆటోలను కొనుగోలు చేశారు. వీటిని వెంటనే ప్రారంభించి వినియోగించాల్సిన అవసరం ఉన్నా.. నిర్లక్ష్యంతో పక్కన పెట్టేశారు. స్థానిక 45వ వార్డులో పారిశుద్ధ్య సిబ్బంది వారం రోజులుగా చెత్త తొలగించలేదు. దసరా పండగపూట కాలనీవాసులు దుర్గంధంతో విసిగిపో యారు. కారణమేంటని కాలనీవాసులు ఆరా తీస్తే ఈ వార్డుకు చెందిన వాహనం 2 నెలలుగా మరమ్మతులో ఉందని పురపాలక సిబ్బంది తెలిపారు. కొత్త వాహనాలు కొనుగోలు చేసినా వార్డులకు కేటాయించకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఈ చిత్రంలో ముసుగుకప్పి కనిపిస్తుంది కొత్త ట్రాక్టరు. చెత్త సేకరణ కోసం రూ.14 లక్షలు వెచ్చించి బల్దియా ఏడాది కిందట దీన్ని కొనుగోలు చేసింది. షోరూం నుంచి తెచ్చి విద్యానగర్ నీళ్లట్యాంకు వద్ద చెట్టుకింద ఇలా నిలిపారు. పురపాలిక అధికారుల నిర్లక్ష్యంతో సంవత్సరం నుంచి వినియోగానికి దూరమై తుప్పుపడుతోంది. పురపాలిక అధికారులకు మరమ్మతులపై ఉన్న శ్రద్ధ వాహనాల నిర్వహణపై లేకుండా పోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏడాదికి రూ.20 లక్షల చొప్పున మరమ్మతులకు వ్యయం చేస్తున్నారు. కొత్త వాహనాలు కొనుగోలు చేయాలనే డిమాండ్ రెండేళ్లుగా ఉన్నా అధికారులు నిర్లక్ష్యం వహించారు. వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణ కొరవడటం.. సభ్యుల నుంచి ఒత్తిళ్లు పెరగడంతో కొత్త వాహనాలు కొనుగోలు చేసినా మరమ్మతుల యావలోపడి వీటి నిర్వహణ మరిచారు. ప్రస్తుతం 15 ఆటోలు మరమ్మతు కోసం నెలల తరబడి మెకానిక్ షెడ్లలో మగ్గుతున్నాయి.

# నేతన్నలకు ఆధునిక శిక్షణ

**మంగళగి, తెలంగాణ దిశ :**మారుతున్న సమాజానికి తగ్గట్టుగా నూతన డిజైన్లు ఉత్పత్తికి అవసరమైన శిక్షణ నేతన్నలకు ఇచ్చి వారు తయారు చేసిన వస్త్రాలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించనున్నట్లు చేనేత జౌళి శాఖ మంత్రి సవిత తెలిపారు. మంగళగిరిలో మంత్రి లోకేశ్ ఏర్పాటు చేసినచేనేత వీవర్స్ శాలనుపరిశీలించారు.కార్మికులకు లభిస్తున్న ఆదాయం, ఉత్పత్తి చేస్తున్న చేనేత వస్త్రాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ నేతన్నలు తన కుటుంబ సభ్యులని వారి అభివృద్ధికి తోడ్పాటును అందించాలని మంత్రి లోకేశ్ తనకు చెప్పినట్లు వివరించారు. నూతన డిజైన్లపై శిక్షణ ఇవ్వడంతో పాటు మంత్రి లోకేశ్ ఉపాధి కల్పిస్తున్నారన్నారు. గతంలో తెదేపా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలన్నీ తిరిగి అమల్లోకి తెస్తామన్నారు. దసరా పండగ దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో చేనేత వస్త్ర విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. వర్షాల కారణంగా నష్టపోయిన చేనేత కార్మిక కుటుంబాలకు రూ.25 వేలు పరిహారం, నూలు కోసం అదనంగా మరో రూ.5 వేలు అందజేస్తామన్నారు. వీవర్స్ సర్వీసు సెంటర్ల ద్వారా 6 వేల మందికి, 5302 నూతన డిజైన్లు రూపొందించి శిక్షణ ఇచ్చామ న్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 375 శిక్షణ తరగతులు నిర్వ హించామన్నారు. చేనేత జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, అడిషనల్ డైరెక్టర్ శ్రీకాంత్ ప్రభాకర్, తెదేపా నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్ధయ్య, నాయకులు జానకీదేవి, దామర్ల రాజు, ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు



# డిసెంబరులో రాజధాని పనులు ప్రారంభిస్తాం



**మంగళగిరి,తెలంగాణ దిశ :**రాజధాని పరిధిలోని 29 గ్రామాలను స మానంగా అ భివృద్ధి చేస్తామని, త్వరలో అన్ని పనులు ప్రారంభమవు తాయని పుర పాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. నిడమర్రు, కురగల్లు గ్రామాలకు చెందిన 10 మంది రైతులు 17 ఎకరాల భూమిని రాజధాని అవసరాలకోసం స్వచ్ఛందంగా భూ సమీకరణకు ముందు కొచ్చిఅంగీకార పత్రాలను అందించారు. మంత్రి నారాయణ ఆ పత్రా లను స్వీకరించి సీఆర్డీఏ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 360 కి.మీ. రోడ్లు, సుమారు 3 వేల అంతర్గత రోడ్లు, అధికారులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం భవనాలు, అసెంబ్లీ, హైకోర్టు తదితర నిర్మాణ పనులను డిసెంబరులో ప్రారంభిస్తామన్నారు. '29 గ్రామాల్లో మూడు వేల ఎకరాలు ఇంకా భూ సమీకరణకు రావాల్సి ఉంది. కొంతమంది రైతులు ప్రస్తుతం భూమిలిచ్చేందుకు తమను సంప్రదిస్తున్నార'ని తెలిపారు. రైతులు ఎవ రు ముందుకొస్తారో మిగిలిన ప్లాట్లలో వారికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. రైతు సోదరులు ఎంతోమంది ముందుకొస్తున్నా రన్నారు. కురగల్లు, నిడమర్రు, తుళ్లూరు మండలం రాయపూడిలో 21 ఎకరాలు రైతులు ఇచ్చారన్నారు. నిర్మాణాలను నిపుణులు పరి శీలించి ఇబ్బంది లేద న్నారు. ప్రస్తుతం ఉన్న కాంట్రాక్టులను రద్దుచేసి మళ్లీ టెండర్లు ఆహ్వానిస్తు న్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియ సీఆర్డీఏ అధికారులు చేపట్టారని వెల్లడించారు. సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ సాయిసూర్య ప్రవీణ్‌చంద్, డిప్యూటీ కలెక్టర్ భీమారావు, తహసీల్దార్ ఆంజనేయులు, ఉప తహసీల్దార్ శ్రీనివాసరావు, తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మత్తు నియంత్రణకు మార్గం ఏదీ ?

ఉమ్మడి జిల్లాలో తరచూ గంజాయి పట్టుబడుతోండటం ఆందోళన కలిగిస్తోంది. ఇతర జిల్లాలు,రాష్ట్రాల నుంచి రోడ్డు, రైలు మార్గానా మహమ్మారి ఇక్కడికి చేరుతోంది. గత 8 నెలల వ్యవధిలోనే ఎక్సైజ్, పోలీసు అధికారులు కిలోల కొద్దీ గంజాయిని పట్టుకోవటాన్ని గమనిస్తే దందా ఏ మేరకు సాగుతుందో అర్థమవుతోంది. మరోవైపు గంజాయికి గ్రామీణ యువత, విద్యార్థులు బానిసలుగా మారుతుండటం ఆందోళన కలిగిస్తున్న విషయం. అనారోగ్యానికి గురవుతామని తెలిసిన వారు మత్తు వీడటం లేదు. ఎక్కువగా నిర్మానుష్య ప్రాంతాల్లో గంజాయి వినియోగిస్తున్నారు. స్థానికులు, ఇతర రాష్ట్రాల వారు ఇక్కడికి రైల్వే మార్గంలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి రవాణా చేస్తున్నారు. రామగుండం, పెద్దపల్లి, ఓదెల, పొత్కపల్లి, బిజిగిరిషరీఫ్, జమ్మికుంట రైల్వేస్టేషన్లు మహారాష్ట్ర, ఒడిశా,ఏపీ రాష్ట్రాలకు అనుసంధానంగా ఉ ండటంతో అక్కడి నుంచి గంజాయి ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాం తాలకు చేరుతోంది. రోడ్డు మార్గంలో రవాణా చేస్తూ కూడా నిందితులు పట్టుబడ్డ దాఖలాలు ఉన్నాయి. జమ్మికుంట రైల్వేస్టేషన్ వద్ద ఓ మహిళ 400 గ్రాముల గంజాయితో స్థానిక ఆబ్కారీ పోలీసులకు పట్టుబడింది. జమ్మికుంటలో ఉంటూ మహారాష్ట్రకు చెందిన వ్యక్తులతో రైల్వే మార్గంలో గంజాయి రవాణా చేస్తున్న విచారణలో తేలింది.

# ప్రగతి చక్రం విచ్ఛిన్నం!




రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ (ఆర్టిసి) విలువైన స్థలాలపై బడా కార్పొరేట్ల కన్ను పడింది. అంతే, కారు చౌకగా ఆయా సంస్థలు కొట్టేసేందుకు వీలుగా టిడిపి కూటమి ప్రభుత్వంలో చకచక విధానాలు తయారై కేబినెట్‌లో ఆమోదానికి సిద్ధమైపోతున్నాయి. భూముల సంతర్పణకు ప్రభుత్వం ఎలాగూ అనుకూలమే కనుక మంత్రిమండలి గ్రీన్‌సిగల్ లాంఛనమే. విజయవాడ నడిబొడ్డునున్న అత్యంత విలువైన గవర్నర్‌పేట-2, పాతబస్టాండ్ జాగాలను అంతర్జాతీయ వాణిజ్య దిగ్గజం లూలూ గ్రూపునకు ధారాదత్తం చేసేందుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. లూలూ సంస్థ ఆర్‌టిసి నుంచి దక్కించుకునే స్థలాల్లో భారీ షాపింగ్‌మాల్ నిర్మిస్తుందని చెబుతున్నారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో విశాఖలో ఇదే సంస్థకు భూములివ్వగా ప్రభుత్వం మారాక పత్తా లేదు. ఆ సంస్థకే ప్రస్తుత కూటమి సర్కారు ఆర్‌టిసి స్థలాలను హారతిపళ్లెంలో పెట్టి మరీ అందిస్తోంది. కనీసం రూ.400 కోట్ల విలువ చేసే ఆర్‌టిసి జాగాను ప్రజల, ఆర్‌టిసి సంస్థ అవసరాలకు వినియోగించాల్సిందిపోయి బహుళజాతి సంస్థ లూలూకు అర్పించుకోవడం, అందుబాటులో ఉండాల్సిన బస్ డిపోను ఎక్కడో ఊరవతలకు తరలించడం ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలకు పరాకాష్ట. ఎప్పుడైతే లూలూకు పాతబస్టాండ్ జాగా ఇస్తారని బయటికి పొక్కిందో ఆ క్షణం నుంచి ప్రజలు, ప్రజాసంఘాలు, ఆర్‌టిసి కార్మికులు ఆందోళనలకు ఉపక్రమించారు. బెజవాడ, పరిసర జనం పాత బస్టాండ్‌ను సెంటిమెంట్‌గా భావించడమే అందుక్కారణం.

మోడీ ప్రభుత్వం ఆర్‌టిసి వ్యవస్థలను ప్రైవేటీకరించేందుకు ప్రత్యేక చట్టాలు చేయగా, ఎప్పటి నుంచో ఆర్‌టిసి ప్రైవేటీకరణ లక్ష్యంతో ఉన్న టిడిపి, ఇదే అదనుగా ముందుకెళుతోంది. ఆర్‌టిసి స్థలాల నగదీకరణ (మోనిటైజేషన్) ప్రాజెక్టు అమలు చేస్తోంది. నీతి-ఆయోగ్ అధికారులు దీనిపై స్వయంగా ఆర్‌టిసి అధికారులతో పర్యవేక్షిస్తున్నారు కూడా. అందులో భాగమే లూలూకు విజయవాడ పాతబస్టాండ్ స్థలాల అప్పగింత. ఆటోనగర్ బస్టాండ్, తిరుపతి బస్టాండ్, విద్యాధరపురం డిపో స్థలాల్లో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణానికి పిపిపి విధానం అమలుకు ప్రతిపాదనలు ఉన్నాయి. అందుకు వ్యతిరేకంగా ఆయా ప్రాంతాల్లో ఆందోళనలు కొనసాగుతున్నాయి. లూలూ మాల్ వస్తే చిరు వ్యాపారులేగాక మధ్యతరగతి, ఆ పైస్థాయి వారి వ్యాపారాలు కూడా కుదేలవుతాయి. గతంలో విజయవాడ పాతబస్టాండ్ జాగాను నగర సుందరీకరణకు తీసుకుంటామంటే ప్రజలు, కార్మికులు తిరగబడ్డారు. విద్యాధరపురం జాగాను ఇండో అమెరికన్ ఆస్పత్రికి ఇవ్వదలిస్తే ప్రతిఘటించారు. దాంతో ఆ రెండు ప్రతిపాదనపైనా సర్కారు విరమించుకోవాల్సి వచ్చింది. రాష్ట్రంలో ఇంకా ఇలాంటివి ఎన్నో ఉన్నాయి.

ప్రభుత్వరంగంలోని ప్రజారవాణా వ్యవస్థలను కార్పొరేట్ల చేతిలో పెట్టే విద్యుత్ బస్‌ల పథకాన్ని మోడీ ప్రభుత్వం రూపొందించింది. కొనసాగింపుగా తొలిదశలో రాష్ట్రంలోని 19 డిపోల పరిధిలో 950 ఎలక్ట్రిక్ బస్‌లను కూటమి ప్రభుత్వం ప్రవేశపెడుతోంది. ఆర్‌టిసి భూములను ఎలక్ట్రిక్ బస్ కంపెనీలకు నామమాత్రపు లీజుకు ఇస్తోంది. ఆ భూముల్లో బస్‌ల పార్కింగ్, నిర్వహణ, ఛార్జింగ్ యూనిట్లు, తదితర అవసరాలకు కంపెనీలు వాడుకుంటాయి. ఎలక్ట్రిక్ బస్‌ల నిర్వహణతో ఆర్‌టిసికి ఎటువంటి సంబంధమూ ఉండదు. అదే జరిగితే ఆర్‌టిసి ఆక్యుపెన్సీ తగ్గి నష్టం వస్తుంది. నిర్వహణాలోపాలతో నష్టాల్లోకి చేరిన సంస్థకు ఇది మరింత నష్టం. అందుకే విద్యుత్ బస్‌ల నిర్వహణను ఆర్‌టిసికే అప్పగించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే పెద్ద సంఖ్యలో ఆర్‌టిసి బస్‌లు శిధిలావస్థకు చేరాయి. ఏళ్లతరబడి రిక్రూట్‌మెంట్ లేదు. బస్‌స్టాండ్‌లు, డిపోల స్థలాలు ప్రైవేటుకు ఇచ్చేస్తే సంస్థ మనుగడ ప్రశ్నార్థకం. 'ప్రగతి చక్రం' విచ్ఛిన్నమవుతుంది. ఇదే సమయంలో ప్రైవేటు ట్రావెల్స్ రోజు రోజుకు దేదీప్యమానంగా వెలిగిపోతాయి. మోడీ, బాబు ప్రభుత్వాలకు ఇదే కావాలి. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్‌టిసికి 20 వేల ఎకరాలకుపైన ఆస్తులున్నాయి. అవి ప్రజల ఆస్తులు. అవి ప్రజావసరాలకే వినియోగించాలి. కార్పొరేట్ల పరం కానీవ్వకుండా పరిరక్షించుకోవడం ఆర్‌టిసి కార్మికులు, సిబ్బందితోపాటు ప్రతిఒక్కరి కర్తవ్యం.

# మళ్లీ ఆశ చిగురిస్తోందా

**విశాఖపట్టణం, తెలంగాణ దిశ :**ఆంధ్రప్రదేశ్ లో భారతీయ జనతా పార్టీకి ఓటు బ్యాంకు లేదు. మోదీ చరిష్మా ఉన్నప్పటికీ స్థిరమైన ఓటు బ్యాంకు కొన్ని దశాబ్దాల నుంచి లేదు. నేటికీ ఆ ఓటు బ్యాంకు శాతం మాత్రం పెరగలేదు. టీడీపీతో పొత్తు పెట్టుకుని పోటీ చేసిన నాడే ఏదో నాలుగైదు సీట్లువస్తాయి. ఇక్కడ పార్టీ అధ్యక్షులు మారినా.. సామాజి కవర్గాల పరంగా ఎంపిక చేసినా.. ఫలితం లేదు. అనేక ప్రయోగాలు చేసిన కేంద్ర నాయకత్వం చివరకు ఆంధ్రప్రదేశ్ లో ఒంటరిగా వెళ్లలేమని డిసైడ్ అయినట్లుంది. అందుకే తొలి నుంచి పార్టీని నమ్ముకున్న వారికి మాత్రమే కీలక పదవులను అప్పగిస్తూ వస్తుంది. ఎవరికీ విడిగా పోటీ చేసే పరిస్థితి లేదు. 2019లో బీజేపీ ఒంటరిగా పోటీ చేసి ఉద్దండులైన వారంతా ఓటమినే చవి చూశారు... ఎవరూ గెలవలేదు. కొన్ని చోట్ల అయితే డిపాజిట్లు కూడా రాలేదు. ఇప్పుడు పొత్తుతో ఎన్నికయిన పురంద్రీశ్వరి పార్లమెంటు సభ్యురాలిగా విశాఖలో ఒంటరిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. మొన్న పొత్తుతో రాజమండ్రి నుంచి గెలిచారు. విష్ణుకుమార్ రాజు 2014లో గెలిచారు. 2014 ఎన్నికల్లోనూ ఎమ్మెల్యేగా గెలిచారు. అంతే తప్ప 2019 ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసి గెలవలేకపోయారు. ఇక సోము వీర్రాజు కూడా అంతే. కన్నాలక్ష్మీనారాయణ నరసరావుపేట ఎంపీగా 2019ఎన్నికలలో పోటీ చేసి ఓడిపోయి మొన్న టీడీపీలో చేరి సత్తెనపల్లి ఎమ్మెల్యేగా గెలిచారు. ఇలా చాలా ఎవరిని తీసుకున్నా బీజేపీ ఒంటరిగాపోటీ చేసినప్పుడు తోలని చెప్పుకుంటున్న వారు కూడా గెలవలేకపోయారు. . అంటే బీజేపీకి ఏపీలో ఏ మాత్రం ప్రజాదరణ, ఓటు బ్యాంకు ఉందో అర్థం చేసుకోవచ్చు. నాయకత్వ లేమితో పాటు ఎవరికీ వ్యక్తిగత ఇమేజ్ లేదని, వారికి గెలిచే సత్తా లేదని రికార్డులు చెబుతున్నాయి. అందుకే బీజేపీ కేంద్ర నాయకత్వం కూడా ఈ సారి గెలిచినప్పటికీ పార్టీలో తామే కీలకం అని భావిస్తున్న వారిని పక్కన పెట్టింది. కేంద్ర మంత్రి పదవిని శ్రీనివాసరాజుకు ఇచ్చింది. రాష్ట్ర మంత్రి పదవిని సత్యకుమార్ యాదవ్ కు కేటాయించింది. రాజ్యసభ పదవిని పాక సత్యనారాయణకు ఇచ్చింది. అంటే కమలం పార్టీ నాయకుల సత్తా కేంద్ర నాయకత్వానికి అర్థమయిందనే అంటున్నారు. అందుకే పార్టీ వీరికి పెద్దగా ప్రాధాన్యం ఇవ్వలేదని చెబుతున్నారు. ఇటీవల బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి కూడా పార్టీకి నమ్మకంగా ఉన్న మాధవ్ ను ఎంపిక చేసిందంటున్నారు. మొత్తం మీద కేంద్ర నాయకత్వానికి రాష్ట్ర నాయకుల మీద విశ్వాసం లేదన్నది మాత్రం అర్థమయినట్లు కనిపిస్తుంది.

# అమరావతిలో ఇన్ని వ్యాలీలా



**విజయవాడ, తెలంగాణ దిశ :**అమరావతి రాజధాని నిర్మాణ పనులు ప్రారంభం అయిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రం మార్కెటింగ్ ఒక రేంజ్ లో చేసి పారేస్తున్నట్లే కనిపిస్తుంది. రాజధాని అమరావతి నిర్మాణ పనులు మొదటిదశకు సంబంధించినవి పూర్తి కావడానికి ఇంకా మూడేళ్ల సమయం పడుతుంది. ఇంకా రాజధాని అమరావతికి సరైన రహదారులు లేవు. అలాగే మౌలిక సదుపాయాలు లేవు. ఈ సమయంలో కార్పొరేట్ సంస్థలు, దేశంలోని దిగ్గజ పారిశ్రామిక సంస్థలు అమరాతిని ఒక రేంజ్ లో చంద్రబాబు మార్కెట్ చేస్తున్నారు. ఒకటి కాదు.. రెండు కాదు.. అమరావతిలో ఇన్నివ్యాలీలా అంటూ సోషల్ మీడియాలో సెటైర్లు వినిపిస్తున్నాయి. ప్రతి సమావేశంలో చంద్రబాబు అమరావతిలో వ్యాలీలు, హబ్ లు అంటూ పెద్దయెత్తున మార్కెటింగ్ చేస్తున్నారు... తొలుత అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ అన్నారు. దీనిపై పెద్దయెత్తున ప్రచారం కూడా చేశారు. క్వాంటమ్ వ్యాలీకి సంబంధించిన పనులు కూడా ప్రారంభమయినట్లు చెప్పారు. భవిష్యత్ లో రాజధాని అమరావతి ప్రపంచంలోనే అత్యున్నతమైన ఐటీ హబ్ గా మారుతుందని, క్వాంటమ్ వ్యాలీ కోసం పేరుగాంచిన సంస్థలు ముందుకు వచ్చాయని కూడా తెలిపారు. ఇక ఇటీవల కేంద్ర క్రీడా శాఖ మంత్రిని కలిసి అంతర్జాతీయ బ్యాడ్మింటన్ హబ్ గా అమరావతిని మార్చాలని కోరారు. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ లో జల క్రీడలకు మంచి అవకాశాలున్నాయని, అందుకోసం కోరారు. అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు క్రికెట్ స్టేడియాన్ని కూడా నిర్మించేందుకు చంద్రబాబు సిద్ధమయ్యారు... ఇక తాజాగా చంద్రబాబు హైడ్రోజన్ వ్యాలీని కూడా ప్రచారం చేయడం మొదలు పెట్టారు. గ్లోబల్ వార్మింగ్ నేపథ్యంలో గ్రీన్ హైడ్రోజన్ కు ప్రాధాన్యం పెరిగిందని, దీనిపై పరిశోధనలు చేయాలని చంద్రబాబు అన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా గ్రీన్ హైడ్రోజన్ కు ప్రాధాన్యత ఇస్తుందని, భవిష్యత్ లో ఆంధ్రప్రదేశ్ గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా తయారవుతుందని అన్నారు. ఎస్ఎఆర్ఎం యూనివర్సిటీలో విద్యార్థులను ఉద్దేశించి చేసిన ఈ వ్యాఖ్యలపై వైసీపీ సోషల్ మీడియాలో సెటైర్లు వినిపిస్తున్నాయి. అమరావతి ఒక పెద్ద వ్యాలీ అని, అక్కడ ఇంకా ఎన్ని వ్యాలీలు తెస్తారంటూ వైసీపీ నేతలు సోషల్ మీడియాలో సెటైర్లు వేస్తున్నారు. మొత్తం మీద అమరావతిని ప్రపంచంలో ప్రమోట్ చేయడంలో మాత్రం చంద్రబాబు ఏ విషయంలో తగ్గడం లేదన్నది విశ్లేకుల అంచనా. మరి చంద్రబాబు కలలు సాకారమవుతాయా? లేదా? అన్నది భవిష్యత్ లో తేలనుంది.

# లోకేష్... నీ టాలెంట్ సూపర్...



**ఏలూరు, తెలంగాణ దిశ :**ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ప్రముఖ పారిశ్రా మికవేత్త ఆనంద్ మహీంద్రా ఆసక్తి చూపడంతో రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి నారా లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదికగా జరిగిన చర్చల్లో ఏపీలో సౌరశక్తి, మైక్రో ఇరిగేషన్, పర్యాటక రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు మహీంద్రా గ్రూప్ సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. ఈ మేరకు ఈవీ వాహనాలు, రక్షణ, ఏరో స్పేస్ తయారీ రంగాల్లో పెట్టుబడులకు రాయితీలు ఇస్తామని లోకేష్ హామీ ఇచ్చారు.సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే నారా లోకేష్.. టాప్ ఇండస్ట్రిలియస్ట్‌తో టచ్ లో ఉండేందుకు వినూత్న ప్రయత్నాలు చేస్తున్నారు. తాజాగా మహింద్రా గ్రూపు తమ కంపెనీకి సంబంధించిన ఓ ప్రకటనను తెలుగులో రూపొందించింది. ఒక్క నిర్ణయం చాలు...మీ విధి మీ చేతుల్లో ఉంది. ట్రక్ మార్చండి. మీ విధిని వశం చేసుకోండి అని ఆనంద్ మహింద్రా తన సోషల్ మీడియా అకౌంట్‌లో దాన్ని షేర్ చేశారు. ఆ ప్రకటనపై నారా లోకేష్ స్పందించారు. తెలుగు ప్రకటన చాలా నచ్చింది సార్. మీ వాహనాలకు ఏపీ పెద్ద మార్కెట్. ఏపీలో అధునాతన ఆటోమోటివ్ ఎకో సిస్టమ్, పెద్ద మార్కెట్‌ను సద్వినియోగం చేసుకోవడానికి సన్ రైజ్ స్టేట్ అయిన ఆంధ్రప్రదేశ్‌లో మహీంద్రా ప్లాంట్ ను ప్రారంభించాలని కోరారు. ఏపీకి వస్తే.. ఉన్న అవకాశాలను తెలియచేయడానికి సిద్ధంగా ఉంటామన్నారు. లోకేష్ ఆఫర్ పై ఆనంద్ మహింద్రా కూడా వెంటనే స్పందించారు. ఆంధ్రప్రదేశ్‌లో అనేక అవకాశాలు ఉన్నాయని.. ఏపీ జర్నీలో తాము కూడా భాగం అవుతామన్నారు. వివిధ రంగాల్లో కలిసి పని చేసేందుకు తమ బృందాలు ఇప్పటికే చర్చలు జరుపుతున్నాయన్నారు.సోలార్, మైక్రో ఇరిగేషన్, టూరిజం వంటి రంగాల్లో పెట్టుబడులు పెడుతున్నామన్నారు. మన ప్రయాణం ఇప్పుడే ప్రారంభమైంది...ముందు ఏమి ఉందో చూద్దామని తెలుగులో రిప్లై ఇచ్చారు. ఈ వారంలోనే నారా లోకేష్ కర్ణాటకలో ఏరో స్పేస్ పార్క్ భూ సేకరణను అక్కడి ప్రభుత్వం రద్దు చేయడంతో వెంటనే లోకేష్ స్పందించారు. తమ వద్ద భూమి అందుబాటులో ఉందని.. రావాలని ఏరో కంపెనీలకు పిలుపునిస్తూ ట్వీట్ చేశారు. ఈ ట్వీట్ వైరల్ అయింది. దీంతో కర్ణాటక పరిశ్రమల మంత్రి కూడా స్పందించాల్సి వచ్చింది. తాము భూసేకరణనుక్యాన్సిల్ చేశాం కానీ ఏరో స్పేస్ పార్క్ ని కాదన్నారు. తమ వద్ద మంచి ఎకోసిస్టం ఉందన్నారు. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆనంద్ మహీంద్రా ఆసక్తి చూపడంతో.. నారా లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. ఎక్స్ వేదికగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. 'మనం కలిసి పనిచేద్దాం. ఈవీ వాహనాలు, రక్షణ, ఏరోస్పేస్ తయారీ రంగాల్లోకి మీ సంస్థను విస్తరించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయా రంగాల్లో పెట్టుబడులు పెట్టే వాళ్లకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం భారీ ఎత్తున రాయితీలు ఇవ్వనుంది. మీరు వీటి తయారీకి ఏపీని ఎంచుకుంటేసం తోషిస్తాం' అని లోకేష్ పేర్కొన్నారు. ఇప్పుడు వీరిద్దిర మధ్య జరిగిన చిట్ చాట్ ఆసక్తికరంగా మారింది. ఏదేమైనా ఒక్క పోస్ట్‌తో లోకేష్.. ఆనంద్ మహీంద్రాను ఒప్పించడం గ్రేట్ అంటున్నారు. ఆయనపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు జనాలు.

# అధ్యక్షా ... అనడం కోసం తాపత్రయం

# ఎన్నాళ్లీ... ఎదురుచూపులు..?

**అనంతపురం, తెలంగాణ దిశ :**చాలామంది తమ వారసులను రాజకీయంగా ఉన్నత పదవుల్లో చూడాలని పరితపిస్తుంటారు. కానీ కొందరే సక్సెస్ అవుతారు. తాము క్రియాశీలకంగా ఉన్నప్పుడే వారసులను రాజకీయ ంగా సెట్ చేయాలని ఎక్కువ మంది భావిస్తారు. కానీ కొంతమందికి అదివీలవుతుంది. చాలామందిదశాబ్దాలుగా ఎదురు చూడాల్సి వస్తుం ది. అటువంటియువ నేతలు, వారసులు ఏపీలోచాలామంది ఉన్నారు. దశాబ్దాలుగా సరైన విజయం దక్కక.. చట్టసభల్లో అడుగుపెట్టలేక రాజకీయాల్లో ఇబ్బంది పడిన వారు ఉన్నారు. అయితే ఒకసారి రాజకీయాల్లోకి రావడమే కానీ.. తిరిగి వెళ్లే పరిస్థితి ఉండదు. ఇప్పుడు కూడా చాలామంది వారసులు సరైన విజయం కోసం పరితపిస్తూనే ఉన్నారు. అటువంటి వారసుల తండ్రులు పేరు మోసిన నేతలే. కానీ క్షేత్రస్థాయిలో వారికి విజయం అందని ద్రాక్ష గానే ఉంది.తండ్రి అకాల మరణంతో రాజకీయాల్లోకి వచ్చారు కింజరాపు రామ్మోహన్ నాయుడు. అంతవరకు ఎర్రం నాయుడుకు ఒక కుమారుడు ఉన్నా రని కూడా ఎవరికీ తెలియదు. కానీ చక్కటి వాగ్దాటితో, చరిస్మ కలి గిన నేతగా ఎదిగారు రామ్మోహన్ నాయుడు. మూడుసార్లు వరుసగా ఎంపీగా గెలిచి అతి చిన్న వయసులోనే కేంద్ర పౌర విమానయాన శాఖను దక్కించుకున్నారు. నారా లోకేష్ తో పాటు చంద్రబాబు కు ఇష్టమైన యువనేతగా మారిపోయారు. అటు తరువాత అమలాపురం ఎంపీ హరీష్ కుమార్ తండ్రి వారసత్వంగా రాజకీయాల్లోకి వచ్చి తొలి ప్రయత్నంలో విఫలమయ్యారు. రెండో ప్రయత్నంలో ఎంపీ అయ్యారు.అయితే చాలామంది వారసులు సరైన గెలుపు కోసం ఎదు రుచూస్తూనే ఉన్నారు. వచ్చేఎన్నికల్లో పోటీచేసి సత్తాచాటాలని భావిస్తు న్నారు. వంగవీటి మోహన్ రంగా కుమారుడు రాధాకృష్ణ 2004లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. అటు తరువాత ఎన్నికల్లో పోటీ చేస్తూ వస్తున్నారే కానీ గెలుపు తట్టలేదు. గత రెండు ఎన్నికల్లో ఆయన పోటీ చేసే అవకాశం చిక్కలేదు. వచ్చే ఎన్నికల్లో మాత్రం పోటీ చేసిచట్టసభల్లో అడుగుపెట్టాలని గట్టి ప్రయత్నం లోనే ఉన్నారు. దేవినేని నెహ్రూ కుమారుడు అవినాష్ పరిస్థితి అలానే ఉంది. కాంగ్రెస్, టిడిపి, వైసీపీ నుంచి ఆయన చేయని ప్రయత్నం లేదు. కానీ గెలుపు బాట పట్టలేదు. వచ్చే ఎన్నికల్లో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఇప్పటినుంచి ప్రయత్నాలు చేస్తున్నారు.మరోవైపు రాయలసీమలో పరిటాల కుటుంబం నుంచి ఎదురుచూస్తున్నారు

శ్రీరామ్. ధర్మవరం నియోజకవర్గ ఇన్చార్జిగా ఉండగా.. ఆయనకు మొన్నటి ఎన్నికల్లో సీటు దక్కలేదు. ఎమ్మెల్యేగా ఎన్నికై అసెంబ్లీలో అడుగు పెట్టాలని ఆయన భావిస్తున్నారు. నేదురుమల్లి కుటుంబానికి సుదీర్ఘ రాజకీయ నేపథ్యం ఉంది. మాజీ ముఖ్యమంత్రి జనార్దన్ రెడ్డి కుమారుడు రామ్ కుమార్ రెడ్డి వైసీపీ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. వచ్చే ఎన్నికలపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఇంకా మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు కుమారుడు రామ్ మనోహర్ నాయుడు, తమ్మినేని సీతారాం కుమారుడు చిరంజీవి వెంకట నాగ్, అయ్యన్నపాత్రుడు కుమారుడు చింతకాయల విజయ్.. ఇలా చెప్పుకుంటూ పోతే చాలామంది వారసులు గెలుపు కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ వారి ప్రయత్నాలు ఎంతవరకు వర్కౌట్ అవుతాయో చూడాలి.

# వర్మపైనే గీత భారమంతా...

**పిఠాపురం, తెలంగాణ దిశ :**పిఠాపురంవిషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆలోచన ఏంటి? కనీసం అక్కడ వాయిస్ వినిపించేవారు లేరు. మొన్నటి ఎన్నికల్లో పోటీ చేసిన వంగా గీత పెద్దగా కనిపించడం లేదు ఎందుకు? పొలిటికల్ సర్కిల్లో ఇదే ఆసక్తికర చర్చ. 2019లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తర పున గెలిచారు పెండ్యం దొరబాబు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ఆయన జనసేనలో చేరిపోయారు. దీంతో జనసేన బలమైన శక్తిగా ఎదిగింది. ఎందుకో వంగా గీత మాత్రం పెద్దగా స్పందించడం లేదు. పార్టీ కార్యక్రమాలను తూతూ మంత్రంగా చేపట్టి వదిలేస్తున్నారు. అయితే భవిష్యత్తు కార్యాచరణ దృష్ట్యా ఆమె వెనక్కి తగ్గినట్లు ప్రచారం నడుస్తోంది.వంగా గీతాది సుదీర్ఘ రాజకీయ నేపథ్యం. ఆమె తెలుగుదేశం పార్టీ ద్వారా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు. ఆ పార్టీలో చురుగ్గా పనిచేశారు. తరువాత ప్రజారాజ్యం పార్టీలో చేరారు. ఆ సమయంలో మెగాస్టార్ కుటుంబంతో

ఆమెకు మంచి సంబంధాలే నడిచాయి. వంగా గీత విష యంలో మెగాఫ్యామిలీ కూడా చాలా సానుకూలంగా ఉంటుంది. అయితే వైసిపి హయాంలో కాకినాడ ఎంపీగా పనిచేశారు గీత. తరువాత పవన్ కళ్యాణ్ పై అనూహ్య పరిస్థితుల్లో పోటీకి నిలబడాల్సి వచ్చింది. అయితే ఆ సమయంలో సైతం పవన్ కళ్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తన ప్రత్యర్థి వంగా గీత మంచి మహిళ అని.. ఎప్పటికైనా ఆమె జనసేనలో చేరడం ఖాయమని తేల్చి చెప్పారు. అయితే పిఠాపురం నియోజకవర్గంలో రెండు మూడు ఘటనలు జరిగాయి. కానీ వంగా గీత పెద్దగా స్పందించ లేదు.తాజాగా రాష్ట్రస్థాయిలో కూటమి ప్రభుత్వవైఫల్యాలపై ఆందోళనలు జరపాలని జగన్మోహన్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కానీ పిఠాపురం నియోజకవర్గంలో మాత్రం ఎక్కడ ఆందోళనలు జరగలేదు. తొలి రెండు రోజులు వంగా గీత నేతృత్వంలో కార్యక్రమాలు నిర్వహించా రు. కానీ 100కు మించి వైసిపి కార్యకర్తలు హాజరు కాలేదు. దీంతో ఆమె పునరాలోచనలో పడిపోయినట్లు తెలుస్తోంది. మరోవైపు గీత భవిష్యత్తు విషయంలో ఒక ఆలోచనకు వచ్చినట్లు ప్రచారం నడుస్తోంది. పిఠాపురం వర్మ విషయంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ భిన్న ప్రచారం చేస్తోంది. ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరితే సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే భవిష్యత్తులో వర్మ వైసీపీలోకి వస్తే తన పరిస్థితి ఏంటనేది గీతకు తలెత్తుతున్న అనుమానం. అందుకే పార్టీ కార్యక్రమాలను ఏదో తూతూ మంత్రంగా నిర్వహించాలన్న ఆలోచనతోఆమె ఉన్నట్లు వైసిపి వర్గాలు చెబుతున్నాయి. అందుకే పిఠాపురం నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉన్నా.. లేనట్టేనని ఆ పార్టీ వర్గాలే చెబుతుండడం విశేషం.ప్రస్తుతం అక్కడ జనసేన బలంగా ఉంది. క్యాడర్ తో జనసేనలోకి వచ్చేశారు.

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సంప్రదాయ ఓటు బ్యాంకు కొనసాగుతూ వస్తోంది. అయితే వైసిపి ఎక్కువగా వర్మపై ఫోకస్ పెడుతుండడం.. గీత భవిష్యత్తుపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. అయితే మెగా ఫ్యామిలీతో ఆమెకు ఉన్న అనుబంధం దృష్ట్యా జనసేనలోకి వచ్చినా ఆశ్చర్యపోనవసరం లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. భవిష్యత్తులో పిఠాపురం నియోజకవర్గ రాజకీయాల్లో సంచలనాలు నమోదయ్యే అవకాశాలు మాత్రం స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# హెచ్ సీఏలో ఏం జరుగుతోంది




## దారి మళ్లుతున్న నిధులు..! జిల్లాల్లోనూ వాళ్లే సభ్యులు.. వాళ్లే ఆటగాళ్లు..?

**హైదరాబాద్, తెలంగాణ దిశ :**కొన్ని రోజులుగా హైదరా బాద్ క్రికెట్ అసోసియేషన్ వ్యవహారం ప్రధానంగా చర్చల్లో నిలుస్తోంది. హెచ్‌సీఏ అవినీతి, అక్రమాలపై ఇప్పటికే సీఐడీ విచారణ చేస్తోంది. ఈ క్రమంలో హెచ్‌సీఏ అక్రమాలు తవ్వుతున్న కొద్దీ ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా క్రికెట్ అభివృద్ధి లక్ష్యాన్ని నిర్వీర్యం చేస్తూ జిల్లాల్లో, గ్రామీణ క్రికెట్‌పై ఆసక్తి ఉన్న క్రీడాకారుల భవిష్యత్‌ను హెచ్‌సీఏ ఫణంగా పెట్టింది.తద్వారా కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడింది. ఎన్నో ఏళ్లుగా జిల్లాల్లో క్రికెట్ అభివృద్ధి నిర్లక్ష్యానికి గురవుతున్నప్పటికీ హెచ్‌సీఏ అధ్యక్షుడిగా జగన్‌మోహన్‌రావు ఎన్నికైన తర్వా త ఇది మరింత దిగజారిపోయింది. అధికారిక లెక్కల్లో నిధులు కేటాయిస్తున్నప్పటికీ నిధుల విని యోగం మాత్రం మచ్చుకు కూడా కనిపించడంలేదు.హెచ్‌సీఏ జిల్లాల్లోని క్లబ్‌లకు పేరుకే నిధులను ప్రకటించి చేతు లు దులుపుకుంటోంది. ప్రతిభ ఉన్న క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా చేయాల్సిన హెచ్‌సీఏ తన బాధ్యతను విస్మరించింది. రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి ఉన్న పిల్లల్లో క్రికెట్‌లో నైపుణ్యం పెంపొందించకుండా అవినీతి, అక్రమాలకు కేంద్రంగా నిలిచింది. ప్రతీ సంవత్సరం జిల్లా క్లబ్‌లు నిర్వహించే సమ్మర్ క్యాంపులకు హెచ్‌సీఏ నిధులు కేటాయిస్తుంది.

2024 ఏప్రిల్‌లో నిర్వహించిన సమ్మర్ క్యాంపుల కోసం గానూ ఒక్కో జిల్లా క్లబ్‌కు రూ.15లక్షలు మంజూరు చేసింది. ఆయా జిల్లాల్లోని 28 సెంటర్లలో 30 రోజుల పాటు సమ్మర్ క్యాంపు నిర్వహిస్తారు.వరంగల్ జిల్లాలో 6, మహబూబ్‌నగర్‌లో 4, మెదక్‌లో 3, నిజామాబాద్‌లో 3, కరీంనగర్‌లో 3, ఖమ్మంలో 3, ఆదిలాబాద్‌లో 3, హైదరాబాద్‌లో 5 సెంటర్లలో సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. ఒక్కో లూ క్యాంపులో 80 నుంచి 100 మంది పిల్లలకు శిక్షణ ఇస్తారు. దీనిలో బాలలకు సంబంధించి అండర్ అండర్ అండర్? బాలికలకు సంబంధించి అండర్ అండర్ శిక్షణ నిర్వహిస్తారు. అయితే ప్రణాళికాపరంగా అంతా బాగానే ఉన్నా..దీన్ని ఆచరించడంలో మాత్రం హెచ్‌సీఏ తీవ్ర నిర్లక్ష్య ధోరణిని అవలంబిస్తోంది.కేవలం పేరుకే జిల్లాల్లో నిర్వహించే సమ్మర్ క్యాంపుల కోసం నిధులు కేటాయిస్తుంది. కానీ ఖర్చు చేసి పిల్లలకు శిక్షణ మాత్రం ఇవ్వదు. సమ్మర్ క్యాంపుల పేరుతో తూతూమంత్రంలా శిక్షణను నిర్వహించి చేతులు దులుపుకుంటోంది. జిల్లాల్లో క్రికెట్ అభివృద్ధి చేయకపోగా సమ్మర్ క్యాంపులు, టోర్నమెంట్ల పేరిట ప్రతి ఏటా కోట్లాది రూపాయల అవినీతికి హెచ్‌సీఏ పాల్పడుతున్నదని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆరోపిస్తున్నది. వాస్తవానికి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కేవలం హైదరాబాద్ జిల్లాకే పరిమితం కావాలి. కానీ తెలంగాణలోని అన్ని జిల్లాల క్లబ్‌లు హెచ్‌సీఏ ఆధ్వర్యంలోనే కొనసాగుతున్నాయి. అయితే హెచ్‌సీఏ పరిధిలో మొత్తం 216 క్లబ్‌లు ఉన్నాయి. వాటిలో కేవలం 8 మాత్రమే జిల్లాల క్లబ్‌లు పనిచేస్తున్నాయి.ఈ గణాంకాల ద్వారా తెలంగాణ రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధిపై హెచ్‌సీఏ నిర్లక్ష్యం, అన్ని జిల్లాల క్లబ్బులపై ఆధిపత్య ధోరణి స్పష్టమవుతున్నది. దీనికి తోడు మొత్తం 216 క్లబ్బుల్లో 57 క్లబ్బులు సస్పెండ్ అయ్యాయి. సస్పెండ్ అయిన క్లబ్బులను కొనసాగించడం, ఫేక్ క్లబ్‌ల నిర్వహణలో హెచ్‌సీఏ మాజీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు కీలకంగా వ్యవహరించారని ఆరోపణలున్నాయి. ఇదిలా ఉంటే ఆయా జిల్లాలకు ఉన్న ఒక్క క్లబ్బుల నిర్వహణలోనూ అవినీతి, అక్రమాలకు హెచ్‌సీఏ తెర లేపింది. పేరుకే జిల్లాల క్లబ్బులు, వాటిలో ఉండే సభ్యులందరూ హైదరాబాద్‌కు చెందిన వారే కావడం గమనార్హం. జిల్లా క్లబ్బుల్లో స్థానికులకు చోటు లేకుండా హెచ్‌సీఏకు సంబంధించిన వ్యక్తులు కొనసాగుతున్నారని టీసీఏ ఆరోపిస్తుంది. దీంతో జిల్లాల క్లబ్బులకు కేటాయించిన నిధులు దుర్వినియోగం కావడానికి మరింత అవకాశం ఉంది.సభ్యులకే కాదు జిల్లా క్లబ్‌ల్లోని ఆటగాళ్లు కూడా హైదరాబాద్‌కు చెందిన వారే ఉంటున్నారనే ఆరోపణ అందరిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. హెచ్‌సీఏ పరిధిలోని ఆటగాళ్లనే జిల్లా క్రికెట్ క్లబ్ తరఫున బరిలో దింపుతున్నారు. ఈక్రమంలో జిల్లా క్లబ్‌ల్లో ఆడేందుకు క్రీడాకారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని టీసీఏ ప్రధానంగా ఆరోపిస్తోంది.దీంతో గ్రామీణ స్థాయి క్రీడాకారులకు అవకాశాలు లేకపోవడమే కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా క్రికెట్ అభివృద్ధి కుంటుపడుతోంది. ఇప్పటికైనా హెచ్‌సీఏ ఆధిపత్యాన్ని తగ్గించడంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని క్లబ్‌లను ఏర్పాటు చేసి ఆసక్తి గల అభ్యర్థులకు సరైన శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి.

# కల్తీ మద్యం తయారీ పై కోదాడ ఆబ్కారీ పోలీస్ అలర్ట్



**కోదాడ, తెలంగాణ దిశ :**కోదాడ పట్టణంలో ఓ వైన్స్ షాపులో నకిలీ మద్యం పట్టుకున్న సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మేళ్లచెరువు మండలం రామాపురం గ్రామంలో కల్తీ మద్యం తయారు చేస్తూ ఏపీతో పాటు పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్న ముఠాను ఎక్సైజ్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఈ నేపథ్యంలో కోదాడ ఎక్సైజ్ పోలీసులు అలర్ట్ అయి పలు వైన్స్ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో సూర్యాపేట రోడ్ లోని ఓ వైన్స్ లో అనుమానాస్పదంగా కనిపించిన మద్యం బాటిల్లను స్టేషన్కు తరలించారు. ఆ మద్యంలో కల్తీ జరిగిందా లేదా అని తెలుసుకునేందుకు వరంగల్ పంపిస్తున్నామని ఎక్సైజ్ సీఐ శంకర్ తెలిపారు. రామాపురం గ్రామంలో పెద్దఎత్తున కల్తీ జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు దారి తీస్తుంది. ఆ మద్యం అమ్మకాలను కోదాడలో కూడా నిర్వహిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆ మద్యం సీసాలను నేరుగా అమ్మకుండా షాపుల్లో తాగే వారికి పెగ్గులాగా విక్రయిస్తున్నారని తెలుస్తుంది. ఎక్సైజ్ పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేస్తే మరింత కల్తీ మద్యం విక్రయాలు బయటపడే అవకాశం ఉందని మందుబాబులు అంటున్నారు.

# యూపీఐ యూజర్లకు అలెర్ట్..!




## ఈ మొబైల్ నంబర్స్ బ్యాంకు, యూపీఐ సేవలు బంద్..!

ఇటీవల కాలంలో స్మార్ట్‌ఫోన్ల వినియోగం భారీగా పెరిగింది. స్మార్ట్‌ఫోన్ ఉన్న ప్రతీ ఒక్కరూ డిజిటల్ పేమెంట్స్ చేస్తున్నారు. చిన్న మొత్తం నుంచి పెద్ద మొత్తంలో యూపీఐ ద్వారానే లావాదేవీలు జరుపుతున్నారు. గూగుల్‌పే, ఫోన్ పే, పేటీఎం తదితర యాప్స్ సహాయంతో డిజిటల్ పేమెంట్స్ చేస్తున్నారు. తాజాగా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాన్ కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ మార్గదర్శకాలు ఏప్రిల్ ఒకటి నుంచి అమలులోకి రానున్నాయి. బ్యాంకులు డిస్‌కనెక్ట్ చేసిన.. లేదంటే సరెండర్ చేసిన మొబైల్ నంబర్‌లను మార్చి 31 వరకు తొలగించాలని యాప్‌లను ఆదేశించింది.

వాస్తవానికి ఒక మొబైల్ నంబర్‌ను వరుసగా 90 రోజుల పాటు వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్.. కనీసం డేటా కోసం ఉపయోగించకపోయినా ఆ నంబర్‌ను మొబైల్ కంపెనీలు డీయాక్టివ్ చేస్తాయి. ఆయా నంబర్లను ఇతరులకు కేటాయిస్తాయి. అలాంటి నంబర్ల వారంతా బ్యాంక్, ఇతర ఆర్థిక లావాదేవీల కోసం లింక్ చేసిన సమయంలో సమస్యలు ఎదురవుతాయి.

ఈ క్రమంలో అలాంటి బ్యాంకు ఖాతాలను తొలగించే పని ఏప్రిల్ ఒకటి నుంచి ప్రతివారం జరుగనున్నది. ఈ మేరకు కొత్త మార్గదర్శకాలను తీసుకువచ్చింది. మార్గదర్శకాల మేరకు బ్యాంకులు డీయాక్టివేట్ అయినా, సరెండర్ చేసిన నంబర్లను ఎప్పటికప్పుడు తొలగిస్తూ.. జాబితాను క్రమం తప్పకుండా అప్‌డేట్ చేయాల్సిందేనని ఎన్‌పీసీఐ స్పష్టం చేసింది.

గతేడాది జులా 16న స్టీరింగ్ కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలను అనుగుణంగా కొత్తగా మార్గదర్శకాలు విడుదల చేసింది. బ్యాంకులు మొబైల్ నంబర్ల గురించి తెలుసుకునేందుకు డిజిటల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగించాల్సి ఉంటుంది. మార్చి 31 నాటికి బ్యాంకులతో పాటు యూపీఐ సర్వీస్ ప్రొవైడర్లు సైతం మార్గదర్శకాలు పాటించాల్సిందేనని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ స్పష్టం చేసింది. ఏప్రిల్ ఒకటి నుంచి వివరణాత్మక నివేదికలు పంచుకోవాల్సిందేనని చెప్పింది.

అలాగే అప్‌డేట్ చేసిన మొబైల్ నంబర్ స్టిసమ్‌ని ఉపయోగించి.. నిర్వహించిన లావాదేవీల సంఖ్యను పేర్కొనాలని పేర్కొంది. ఎన్‌పీసీఐ చర్యతో సమస్యలు తగ్గుతాయని భావిస్తున్నారు. వాస్తవానికి యూపీఐ కోసం మొబైల్ నంబర్ తప్పనిసరి. గతంలో యూపీఐకి లింక్ చేసిన నంబర్లను ఉపయోగించి ప్రస్తుతం చాలామంది లావాదేవీలు జరుపుతున్నారు. ఏప్రిల్ ఒకటి నుంచి అలా చేయడం కుదరదు. తప్పనిసరిగా యాక్టివ్‌లో ఉన్న నంబర్ మాత్రమే బ్యాంకులు పరిగణలోకి తీసుకుంటాయి. యాక్టివ్‌లో లేని నంబర్ల యూపీఐలను డీయాక్టివేట్ కానున్నాయి. మీకు తప్పనిసరిగా యూపీఐ సేవలు కావాలంటే ఆయా మొబైల్ నంబర్లను తప్పనిసరిగా రీచార్జ్ చేయాల్సిందే. లేకపోతే ఇబ్బందులు తప్పవు.

# ఏపీకి పోర్టబుల్ ఆస్పత్రి...

**విజయవాడ, తెలంగాణ దిశ :**మన దేశంలో రోడ్డు ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో తక్షణ వైద్యం అందక చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా కేంద్ర ప్రభుత్వం 'భీష్మ' పేరుతో పోర్టబుల్ ఆసుపత్రిని అందుబాటులోకి తెచ్చింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మూడు భీష్మ యూనిట్లను కేటాయించింది. ఇది ఒక చిన్న ఆసుపత్రిలా పనిచేస్తుంది. దీని ద్వారా క్షతగాత్రులకు వెంటనే వైద్యం అందించవచ్చు. మన దేశంలో రోడ్డు ప్రమాదాలు, ప్రకృతి విపత్తులు నిత్య కృత్యాలు. ప్రతి రోజు ఏదో ఒక చోట ప్రమాదాలు సంభవిస్తూనే ఉంటాయి. అయితే వెంటనే స్పందించి గాయపడిన వారికి చికిత్స అందిస్తే చాలా వరకు ప్రాణ నష్టాన్ని నివారించవచ్చని నిపుణులు చెబుతుంటారు. కానీ మన దగ్గర అందుకు అవసరమైన సదుపాయాలు లేవు. దీంతో ప్రమాదాలు, ప్రకృతి విపత్తులు వేళ తక్షణ సాయం అందక ప్రాణ నష్టం అధికంగా సంభవిస్తుంది. అయితే ఈ సమస్య పరిష్కారినికి కేంద్రం అద్భుతమైన ఆవిష్కరణ చేసింది. అదే భీష్మ .. పోర్టబుల్ ఆస్పత్రి. తాజాగా కేంద్ర ప్రభుత్వం ఏపీకి మూడు భీష్మ యూనిట్లు కేటాయించింది. ఆ వివరాలు..విపత్తులు, ప్రమాదాల్లో గాయపడిన వారికి వెంటనే చికిత్స అందించే సమస్యను పరిష్కరించడానికి 'భీష్మ' అందుబాటులోకి వచ్చేసింది. ఇది ఒక పోర్టబుల్ ఆసుపత్రి. దీనిని ఆరోగ్య మైత్రి క్యూబ్ పేరుతో రక్షణ, ఆరోగ్య మంత్రిత్వ శాఖలు తయారు చేశాయి. దీని అసలు పేరు భారత్ హెల్త్ ఇనీషియేటివ్ ఫర్ సహయోగ్ హితా అండ్ మైత్రి (భీష్మ). విపత్తులు, ప్రమాదాల్లో గాయపడ్డ వారికి వెంటనే వైద్యం అందించేందుకు తయారు చేసిన భీష్మ యూనిట్లను ఏపీకి కేటాయించారు. కేంద్ర ప్రభుత్వం గుంటూరు జిల్లాలోని మంగళగిరి ఎయిమ్స్‌కు మూడు భీష్మ యూనిట్లను కేటాయించింది.భీష్మ యూనిట్ అంటే 72 చిన్న క్యూబ్‌లతో కూడిన ఒక చిన్న ఆసుపత్రి. దీని బరువు ఒక టన్ను ఉంటుంది. దీనిని రోడ్డు మార్గంలో ఎక్కడికైనా సులువుగా తీసుకెళ్లవచ్చు. డ్రోన్లు, పారాచూట్‌లతో పాటు హెలికాప్టర్‌లో కూడా తరలించవచ్చు. 10 నిమిషాల్లోనే దీన్ని ఆసుపత్రిగా మార్చవచ్చు. భీష్మ లెవెల్-3 ట్రామా సెంటర్‌గా కూడా పనిచేస్తుంది. ఇది గోల్డెన్ అవర్‌లో ప్రాణాలను కాపాడుతుంది. అడ్వాన్స్‌డ్ ట్రామా లైఫ్ సపోర్ట్, విపత్తుల్లో గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందిస్తుంది. దీనిలో టాక్టికల్ కాంబాట్ క్యాజువాల్టీ కేర్ కూడా ఉంది.ఇక ఈ భీష్మ యూనిట్ సౌర విద్యుత్తుతో నడుస్తుంది. దీనిలో వెంటిలేటర్లు, జనరేటర్లు, పరీక్షల కిట్లు, డాక్యుమెంటేషన్ టూల్స్‌తో పాటు పోర్టబుల్ ఎక్స్‌రే, అల్ట్రా సౌండ్, ఏఈడీ, యాంటీబయాటిక్స్, ఐవీ ఫ్లూయిడ్లు, మినీ ల్యాబ్, సర్జికల్ కిట్లు, ఈసీజీ/బీపీ/ఎస్‌పీవో2 సిస్టం ఇలా చికిత్సకు అవసరమైన అన్ని యూనిట్లు ఉన్నాయి. ఇది పది నిమిషాల్లో 30కి పైగా పరీక్షల ఫలితాలను అందిస్తుంది. ఒక్కో యూనిట్‌లో 200 మందికి చికిత్స చేయవచ్చు. 20 అత్యవసర సర్జరీలు కూడా చేయవచ్చు.గుంటూరులోని ఎయిమ్స్‌కి కేంద్రం మూడు భీష్మ యూనిట్లను అందించింది. దీంతో ఎయిమ్స్‌లో వీటినిప్రదర్శించారు. విశ్రాంత ఎయిర్ మార్షల్ డాక్టర్ తన్మయ్ రాయ్, యూనిట్‌ను ఆసుపత్రిగా ఎలా మార్చవచ్చో వివరించారు. ఈ భీష్మ యూనిట్‌ను క్షతగాత్రుల పాలిట సంజీవనిగా చెబుతున్నారు.

# పొంగి ప్రవహిస్తోన్న అన్నవరం వాగు





**వి.ఆర్ పురం, తెలంగాణ దిశ :** అన్నవరం వాగు పొంగి ప్రవహిస్తోంది. గత రెండు రోజులుగా వాతావరణంలోని భారీ మార్పుల కారణంగా వర్షం రావడం వలన అన్నవరం ఉమ్మడివరం మధ్య గల వెదుర్ల వాగు ఉదఅతంగా పొంగి ప్రవహిస్తుంది. గతంలో ఉన్నటువంటి హై లెవెల్ వంతెన కూలిపోవడం వలన ప్రత్యామ్నాయంగా తాత్కాలిక వంతెన ను నిర్మించడం జరిగింది. ఈ వంతెన ఎత్తుతక్కువగా ఉండడం వలన చిన్న వర్షంవచ్చిన వరద నీరు పైనుంచి పొంగి ప్రవహిస్తూ ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. ఈ వాగుపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపడితే తప్ప సమస్య పరిష్కారమయ్యే మార్గం లేదు. హై లెవెల్ బ్రిడ్జి కి దాదాపు రెండు కోట్ల రూపాయలతో అంచనాలు వేసి సంబంధిత అధికారులకు పంపినట్లు సమాచారం. వాగు నీటితో పొంగి ప్రవహిస్తున్నటువంటి లో లెవెల్ బ్రిడ్జిని స్థానిక తహసిల్దార్ సరస్వతి వి ఆర్ పురం పోలీస్ శాఖ సిబ్బంది పరిశీలించి ఇరువైపులా ప్రయాణికులను నీరు తగ్గేవరకు బ్రిడ్జిపై ప్రయాణం చేయవద్దని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని తెలియపరచి హెచ్చరికలు జారీచేసితగ్గుచర్యలు తీసుకున్నారు.

# వైసీపీకి రానున్నదంతా గడ్డుకాలమే..!



**విజయవాడ,తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్ లో వైసీపీకి రానున్న కాలమంతా గడ్డుకాలమే. ఎందుకంటే ఇప్పటికే అనేక విషయాలపై విచారణ ప్రారంభించిన ప్రస్తుత ప్రభుత్వం అన్ని విభాగాల్లో జరిగిన అవినీతిపై లోతైన దర్యాప్తు చేయనుంది. అయితే ఆధారాలను స్పష్టంగా సేకరించిన తర్వాత మాత్రమే కేసులు నమోదు చేయనున్నారు. న్యాయస్థానాల్లో వీగిపోకుండా పకడ్బందీగా అగ్రనేతల మెడ చుట్టూ కేసుల ఉచ్చు బిగుసుకునే ఛాన్స్ ఉంది. గత ప్రభుత్వంలో అనుసరించిన లిక్కర్ అమ్మకాలపైనే ఈ ప్రభుత్వం ప్రధానంగా దృష్టి పెట్టింది. లిక్కర్ స్కామ్ లో నిందితులను వరసగా అరెస్ట్ లు చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఇందుకోసం ఇప్పటికే ఒక ప్రణాళిక ప్రకారం పోలీసు ఉన్నతాధికారులు విచారణ ప్రారంభించనున్నారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో లిక్కర్ అమ్మకాలను ప్రభుత్వమే జరిపింది. నాసిరకం మద్యాన్ని అధిక ధరకు విక్రయించడం, డిజిటల్ పేమెంట్స్ కు అంగీకరించకపోవడం వంటి అంశాలు ఈ విచారణలో కీలకంగా మారనున్నాయి. ప్రయివేటు సిబ్బందిని లిక్కర్ దుకాణాల్లో నియమించి జరిపిన అమ్మకాల ద్వారా వచ్చిన మొత్తం ఎటు వెళ్లిందన్న దానిపై ఇప్పటికే ఆరా తీస్తున్నారు. ఈ కేసులో ప్రధానంగా ఇటీవల మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి పేరును కూడా బయటపెట్టారు. ఆయనలే లిక్కర్ వ్యాపారంలో కీలకంగా వ్యవహరించారని సాయిరెడ్డి ఆరోపించారు. మద్యం కుంభకోణంలో కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి కీలక పాత్ర పోషించారంటూ సాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలతో ఇప్పుడు ఈ ఫైలు వేగంగా ముందుకు కదులుతుంది. కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి గత ప్రభుత్వంలో ఐటీ సలహాదారుగా పనిచేశారు. అతనే ప్రధాన సూత్రధారి అంటూ సాయిరెడ్డి చేసిన కామెంట్స్ కోణంలో అధికారులు ఇప్పటికే దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిసింది. తెర వెనక ఉండి ఆయనే అంతా నడిపించారని, లిక్కర్ ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఎక్కడకు వెళ్లాయన్నది కసిరెడ్డిని విచారిస్తే ఖచ్చితంగా తెలుస్తుందని పోలీసులు భావిస్తున్నారు. ఇందులో వైసీపీ అగ్రనేతల ప్రమేయం ఉండే అవకాశం ఉందని భావించిన ప్రభుత్వ పెద్దలు కొంత ఆలస్యమయి నా పకడ్బందీగా కేసును రూపొందించాలని ఆదేశాలు జరీ చేసినట్లు సమాచారం. కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డికి విదేశాల్లోనూ లిక్కర్ షాపులను నడిపిన అనుభవం ఉందని తెలియడంతో ఆయన గత ప్రభుత్వంలో ఈ స్కాంలో కీలకంగా వ్యవహరించారంటున్నారు. నాటి ముఖ్య మంత్రి వైఎస్ జగన్ కు అత్యంత దగ్గరని, ఆప్తుడని కూడా గుర్తించారు. ఈ కోణంలోనే దర్యాప్తు అత్యంత వేగంగా జరుగుతున్నాయి. కసిరెడ్డి రాజవేఖర్ రెడ్డి దొరికితే మొత్తం వ్యవహారం బయటకు వస్తుందని విచారణ చేస్తున్న అధికారులు భావిస్తున్నారు. కసిరెడ్డి కోసం ఇప్పటికే వేట ప్రారంభమయిందని చెబుతున్నారు. ఆయన దొరికిన వెంటనే మద్యం కేసులో కీలక నేతలను కొందరిని అదుపులోకి తీసుకుని విచారణ చేసే అవకాశముందని కూడా అధికార వర్గాల నుంచి అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. డిస్టలరీలు, మద్యం అమ్మకాలు, నాసిరకం మద్యం వంటి అంశాలపై ఇప్పటికే కొంత మేరకు ఆధారాలను సేకరించిన అధికారులు స్పష్టమైన సాక్షాధారాల కోసం ప్రయత్నిస్తున్నారు. అవి లభించినట్లే ఊహించని పరిణామాలు ఏపీలో జరిగే అవకాశముందని చెబుతున్నారు.

# ప్రైవేట్ కు దీటుగా పెద్దపల్లి ప్రభుత్వ దవాఖాన



**పెద్దపల్లి, తెలంగాణ దిశ :**మన ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని, వీటిని అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే చింత కుంట విజయరామణారావు అన్నారు.జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కంటి శస్త్ర చికిత్స చేయించుకున్న వారికి మొదటిసారిగా ప్రభుత్వం తరుపున ఉచితంగా కళ్ళద్దాలను ఆసుపత్రి సూపరిండెంట్ శ్రీధర్ సిబ్బందితో కలిసి శాసనసభ్యులుచింతకుంట విజయరమణ రావు పంపిణీ చేశారు. అనంతరం ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందిస్తునందుకు సూపరిండెంట్ శ్రీధర్ తోపాటు వైద్యులను ఎమ్మెల్యే విజయరమణ రావు అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రైవేటు ఆసుపత్రులకు ధీటుగా పనిచేస్తుందని అన్నారు. మన పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అధునాతనమైన వైద్య పరీక్షలు, శస్త్ర చికిత్సలు అందిస్తూ పేద కుటుంబాలకు సహాయసహకారాలు అందిస్తున్నామని తెలిపారు. ప్రైవేటు ఆసుపత్రులకు తగ్గకుండా ప్రభుత్వ ఆసుపత్రి అన్ని విధాలుగా సేవలను అందిస్తూ పేదవారికి వైద్య ఖర్చులు లేకుండా చేస్తున్నామని గుర్తుచేశారు. మన ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చాక పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో గణనీయమైన మార్పులు చేశామని అన్నారు.

# రష్మిక మరో బిగ్ స్టెప్..



స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న కెరీర్ లో ఇప్పుడు ఓ రేంజ్ లో దూసుకుపోతుందని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. వరుస సినిమాల్లో నటిస్తున్న అమ్మడు.. అదే సమయంలో హిట్స్ కూడా అలాగే అందుకుంటోంది. బ్లాక్ బస్టర్ సినిమాలతో అందరినీ మెప్పిస్తున్న రష్మిక.. మరిన్ని సినిమాల్లో ఛాన్స్ లు సొంతం చేసుకుని సత్తా చాటుతోంది. మొత్తానికి మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ గా బిజీగా ఉన్న ఆమె.. షూటింగ్స్ తో తీరిక లేకుండా గడుపుతుందనే చెప్పాలి. ఇప్పుడు సౌత్ టు నార్త్.. అనేక ఆఫర్స్ ఆమె చేతిలోనే ఉన్నాయి. అలా తక్కువ టైమ్ లో ఎక్కువ డబ్బులు సంపాదిస్తున్నట్లే ఉంది. అదే సమయంలో ఇప్పుడు రష్మిక మందన్న వ్యాపార రంగంలోకి అడుగుపెట్టింది. ఆ విషయాన్ని ఆమెనే చెబుతూ పోస్ట్ చేసిన వీడియోస్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. తొలుత ఓ వీడియో షేర్ చేస్తూ.. "నేను చివరకు దీన్ని రికార్డ్ చేస్తున్నానని నేను నమ్మలేకపోతున్నాను. మీకు ఇప్పటికే తెలిసినట్లుగా, నేను నా హృదయానికి చాలా దగ్గరగా ఉన్న దానిపై పని చేస్తున్నాను" అంటూ చెప్పుకొచ్చింది. "మీరు దానిని అనుభవిస్తారని నేను ఆశిస్తున్నాను, మీరు దానినిఇష్టపడతారని నేను ఆశిస్తున్నాను.దానినిమీతో పంచుకోవ డానికి వేచి ఉండలేను. చాలా చాలా చాలా ఉత్సాహంగా ఉన్నాను. ఆందోళనగా ఉన్నాను. కృతజ్ఞతతో ఉన్నాను" అని చెప్పిన రష్మిక..

ఆ తర్వాత తన తల్లితో జరిగిన సంభాషణ వీడియోను పోస్ట్ చేసింది. అందులో రష్మిక "నేను ఇప్పుడు చాలాముఖ్యమైన షూట్‌కువెళ్తున్నాను. మీరు చెప్పిన వ్యాపారాన్ని నేను ప్రారంభిస్తాను" అని తల్లితో చెప్పగా.. ఆమె బెస్ట్ విషెస్ చెబుతారు. అయితే రష్మిక ఏ బిజినెస్ స్టార్ట్ చేయనుందో వెల్లడించలేదు.

ప్రస్తుతం ఆమెకు సోషల్ మీడియాలో బెస్ట్ విషెస్ వెల్లువెత్తుతున్నాయి. బిజినెస్ లో కూడా సక్సెస్ అవ్వాలని అంతా కోరుకుంటున్నారు. కాగా, ఇప్పటికే అనేక మంది స్టార్ హీరోయిన్స్..సొంత ఫ్యాషన్ బ్రాండ్‌ను స్టార్ట్ చేసిన విషయం తెలిసిందే. తమ బిజినెస్ తో రాణిస్తున్నారు. ఇప్పుడు రష్మిక కూడా వారి బాటలోనే వెళ్తున్నారని తెలుస్తోంది. ఆ విషయాన్నే అనౌన్స్ చేయనున్నారని సమాచారం. మరి చూడాలి రష్మిక ఏ బిజినెస్ స్టార్ చేస్తారో..


# పవన్ సినిమాలో రాశీ ఖన్నా..



టాలీవుడ్‌లో దశాబ్దకాలంగా తనదైన ముద్ర వేసుకున్న కథానాయిక రాశీ ఖన్నాకు ఎట్టకేలకు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సరసన నటించే అవకాశం దక్కించుకుంది. హరీష్ శంకర్ దర్శకత్వంలో పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్. ఈ సినిమాలో ఇప్పటికే శ్రీలీల కథానాయికగా నటిస్తుండగా.. మరో కథానాయికగా రాశీ ఖన్నా ఎంపికైనట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. ఈ సినిమాలో శ్లోక అనే పాత్రలో కనిపించబోతుంది రాశీ. ఈ సందర్భంగా రాశీ ఫొటోను చిత్రయూనిట్ పంచుకుంది. మరోవైపు ఇప్పటికే రాశీ షూటింగ్ సెట్‌లో అడుగు పెట్టి, పవన్ కళ్యాణ్‌తో కలిసి కీలక సన్నివేశాల్లో పాల్గొంటున్నారని సమాచారం. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. 'గబ్బర్ సింగ్' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత పవన్ కళ్యాణ్-హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో 'ఉస్తాద్ భగత్ సింగ్'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

# అకీరానందన్ కటౌట్

బెంగళూరు, : పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన 'హరి హర వీరమల్లు'చిత్రం థియేటర్స్ బయట కటౌట్స్, బ్యానర్స్, బ్యాండ్ ఇలా చెప్పుకుంటూ పోతే చాలానే ఉన్నాయి. సాధారణంగా ఇలాంటివి సినిమా విడుదల రోజు చేస్తుంటారు. కానీ ఇక్కడ మాత్రం నాలుగు రోజుల ముందే మొదలు పెట్టేశారు. ఎంతైనా పవన్ కళ్యాణ్ సినిమా వచ్చి మూడేళ్లు దాటింది. అభిమానుల్లో ఆ మాత్రం ఆకలి ఉండడం సహజమే. బెంగళూరు లో ఈరోజు పవన్ కళ్యాణ్ అభిమానులు సంధ్య థియేటర్ వద్ద చేసిన హంగామాకు సమందించిన వీడియోస్ ఇప్పుడు సోషల్ మీడియా లో సెన్సేషనల్ టాపిక్ గా మారింది. ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా 12 కటౌట్స్ ని థియేటర్ వద్ద ఏర్పాటు చేశారు.అంతే కాకుండా పవన్ కళ్యాణ్ తనయుడు అకిరా నందన్ కి సంబందించిన కటౌట్ ని కూడా లాంచ్ చేశారు. అందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియా లో బాగా వైరల్ అయ్యింది. అకిరా నందన్ ఈమధ్య కాలం లో సోషల్ మీడియా లో బాగా వైరల్ అయ్యాడు. ఒకప్పుడు కెమెరా ముందుకు రావడానికే భయపడే అకిరా నందన్, ఇప్పుడు తన తండ్రితో కలిసి జాలీగా తిరుగేస్తున్నాడు. ఆయనకు సంబంధించిన లేటెస్ట్ ఫోటోల లో ఒకటి ఎంచుకొని ఈ కటౌట్ ని లాంచ్ చేశారు. దీనికి ఆడియన్స్ నుండి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఆ వీడియో ని మీరు కూడా క్రింద చూసేయండి. అదే విధంగా విజయవాడ లో కూడా అభిమానులు కటౌట్ ని లాంచ్ చేస్తూ సంబరాలు చేసుకున్నారు. ఇది కూడా ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. కటౌట్ లాంచ్ ఈవెంట్ కి అంత మంది అభిమానులు రావడం ఏంటి బాబోయ్ అని ఆశ్చర్యపోయారు.ఇప్పుడే ఇలా ఉందంటే ఇక విడుదల రోజు ఎలా ఉంటుందో. పైగా ఫైడ్ ప్రీమియర్ షోస్ కూడా ఉన్నాయి. రాబోయే రోజులు మొత్తం పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ హంగామా




ఆన్లైన్ లో ఆఫ్ లైన్ లో నాన్ స్టాప్ గా చూడబోతు న్నాం అన్నమాట. ఆరేళ్ళ తర్వాత వస్తున్న సినిమా కావడం తో ఈ చిత్రంపై మామూలు ఆడియన్స్ లో కావాల్సినంత హైప్ జనరేట్ అవ్వలేదు అనేది వాస్తవం. కానీ రేపు హైదరాబాద్ శిల్ప కళా వేదికలో జరగబోయే ప్రీ రిలీజ్ ఈవెంట్ మాత్రం ఒక రేంజ్ లో హైప్ ని జనరల్ ఆడియన్స్ లో క్రియేట్ చేస్తుందని, అభిమానులు కంగారు పడాల్సిన అవసరమే లేదని అంటున్నారు. అంతే కాదు మూవీ టీం తరుపున రేపు ఒక మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నారు. దీనికి పవన్ కళ్యాణ్ కూడా హాజరు కాబోతున్నాడట.

# పారిశ్రామిక ప్రాంతంలో పూల మొక్కలకు భలే గిరాకి..



వర్షాకాలం వచ్చిందంటే చాలు తమ ఇండ్ల వద్ద ఏదో ఒక రకం పూల మొక్కలు గాని ఇతరత్రా మొక్కలు గాని పెట్టడం జరుగుతుంది. దీనికిగాను భలే డిమాండ్ తో పాటు భలే గిరాకీ ఉంటుంది.ముఖ్యంగా కోల్ బెల్ట్ ప్రాంతమైన గోదావరిఖని ఎనిమిదవ కాలనీ సెంటినర కాలనీ కమాన్ పూర్ ప్రాంతాల్లో ఆంధ్ర మరియు ఖమ్మం జిల్లాల నుండి వివిధ రకాల మొక్కలను తీసుకువచ్చి ఈ ప్రాంతంలో విక్రయిస్తారు. ముఖ్యంగా వీరు ఆంధ్ర ప్రాంతంలో వేసవిలో నర్సరీలో పెంచి వాటిని పట్టణ ప్రాంతాలకు తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. వర్షాలు మొదలుకాగానే వీరు వివిధ పట్టణాల్లో రోడ్ల పక్కనవివిధ రకాల మొక్కలైన రంగురం గుల గులాబీల, మామిడి, కొబ్బరి, చామంతి, ఆర్కే పాంట్స్, మందార, జిల్లి పెఎస్, వంటి మొక్కలను తీసుకురావడం జరుగుతుంది. మీరు ఆంధ్ర ప్రాంతంలో మరియు తెలంగాణలోని ఖమ్మం ప్రాంతంలో రైతులు నర్సరీలో పెంచి హెూల్సేల్ లో ఇవ్వడం జరుగుతుంది. దీంతో వేరు లారీల్లో తీసుకువచ్చి పారిశ్రామిక ప్రాంతంలో మరియు పట్టణ ప్రాంతాల్లో మొక్కలను నాటడం జరుగుతుంది. తాము వర్షాలు కురియడం తో రైతుల వద్ద వివిధ రకాల మొక్కలను కొనుగోలు చేసి తీసుకువచ్చి తెలంగాణ ప్రాంతాల్లో వికరించడం జరుగుతుందని ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గానికి చెందిన బొజ్జ శ్రీనివాస్ తెలిపారు. సీజన్ అనంతరం తమ ప్రాంతాలకు వెళ్లి మళ్లీ యధావిధిగా తమ పనులను చేసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సీజన్లో కొద్దిగా గొప్ప లాభాలు తమకు చేకూరుతాయని తెలిపారు.

# సాఫ్ట్‌గా గడిపొద్దాం!



నేటితరం.. ఉరుకులు పరుగులతోనే జీవితాన్ని గడిపేస్తున్నది. ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునేదాకా.. కాలంతో పరుగులు తీస్తున్నది. ఇంట్లో ఉన్నా, ఆఫీస్‌కు వెళ్లినా.. వారి పరిస్థితి ఆగమాగమే అవుతున్నది. చివరికి సరదాగా గడపాల్సిన విహారయాత్రల్లోనూ.. ప్రశాంతంగా ఉండలేకపోతున్నది. ఈ పరిస్థితికి ఓ కొత్త ట్రెండ్ పరిష్కారం చూపుతున్నది. 'సాఫ్ట్ ట్రావెల్'.. విహారయాత్రలను అందంగా, ఆహ్లాదంగా మారుస్తున్నది. వారం మొత్తం కష్టపడి.. వారాంతంలో ఒక ట్రిప్ ప్లాన్ చేస్తారు. సరదాగా గడిపొద్దామని బయల్దేరి.. అంతటా హడావుడి పడుతుంటారు. ప్రయాణం మొదలైనప్పటి నుంచి ముగిసేదాకా.. ప్రతి విషయంలోనూ ఆగమాగం అవుతుంటారు. మనసారా సందర్శించాల్సిన ప్రదేశంలో పట్టుమని పది నిమిషాలు కూడా ఉండలేరు. స్థానిక వంటకాల్ని ఆస్వాదించలేరు. ఫ్లయిట్ టైమ్ అవుతుందనో.. ట్రెయిన్ బయల్దేరుతుందనో కంగారు పడుతుంటారు. ఆగమేఘాల మీద తిరుగు ప్రయాణం అవుతారు. ఇలాంటి విహారయాత్రలు ఎన్ని చేసినా.. మనసుకు ఏమాత్రం ప్రశాంతంగా అనిపించదని అంటున్నారు నిపుణులు. దీనికి పరిష్కారంగా.. 'సాఫ్ట్ ట్రావెల్' చేయాలని సూచిస్తున్నారు. **ఏంటీ 'సాఫ్ట్ ట్రావెల్'?:** 2025లో అత్యంత ఆసక్తికరమైన, అత్యంత ప్రశాంతమైన 'ట్రావెల్ ట్రెండ్'గా నిలుస్తున్నది.. సాఫ్ట్ ట్రావెల్! ప్రపంచాన్ని మరింత ప్రశాంతంగా అన్వేషించడానికి ఈ ట్రెండ్ ఎంతో ఉపయోగపడుతున్నది. సమయం మించిపోతున్నదన్న బెంగ లేకుండా, ఎలాంటి తొందరపాటు పడకుండా.. ప్రశాంతంగా, హాయిగా ట్రిప్‌ను ఎంజాయ్ చేయడమే.. సాఫ్ట్ ట్రావెల్! ప్రస్తుతం టూర్ ప్లాన్ చేసుకునే ప్రతి ఐదుగురిలో.. ఒకరి కంటే ఎక్కువమంది తగినంత విశ్రాంతినే కోరుకుంటున్నారు. మానసిక ఆరోగ్యం, తమను తాము తెలుసుకునేందుకు ఏదో ఒక ట్రిప్ వెళ్లాలని ప్లాన్ చేసుకుంటారు. ఇలాంటివారంతా ఇప్పుడు 'సాఫ్ట్ ట్రావెల్' వైపు మొగ్గుచూపుతున్నారు. **ఎన్నో ప్రయోజనాలు:** సాఫ్ట్ ట్రావెల్ వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ఇందులో మానసిక ప్రశాంతతకే తొలి ప్రాధాన్యం. ఉదయం లేవడం.. ఆదరాబాదరాగా తినడం.. సైట్ సీయింగ్‌కు వెళ్లడం సాఫ్ట్ ట్రావెల్‌లో ఉండదు. మీకు కావాల్సినంత సమయంపాటు పడుకోవ చ్చు. ఇందులో భాగంగా ఒకే ప్రాంతంలో వారం, పది రోజులపాటు ఉంటారు. కాబట్టి, అక్కడి సంస్కృతి సంప్రదాయాల గురించి పూర్తిగా అవగాహన ఏర్పడుతుంది. స్థానిక ఆహారాలనూ పరిపూర్ణంగా ఆస్వాదించొచ్చు.

ఆ రోజు ఏం చేయాలో.. ఎక్కడెక్కడ తిరగాలో మీరే నిర్ణయించుకోవచ్చు. మీకు నచ్చినట్టుగా ఉండొచ్చు. ఇందులో మరో ముఖ్యమైన అంశం.. సాఫ్ట్ అడ్వెంచర్. సుదూర ప్రాంతాలకు హైకింగ్‌లు, ట్రెక్కింగ్ చేయడం. ఇందులోనూ థ్రిల్ ఉంటుంది. కాకుంటే.. కొంచెం నెమ్మదిగా, సాఫ్ట్‌గా! ఒక్కమాటలో చెప్పాలంటే.. సాఫ్ట్ ట్రావెల్ అంటే, ప్రయాణాన్ని మరింత సౌకర్యంగా, విశ్రాంతి తీసుకుంటున్నట్టుగానే ఆస్వాదించడం.

# రోడ్లపై రయ్యిమంటూ..



దేశంలో మహిళా డ్రైవర్లు పెరుగుతున్నారు. హైవేలపై రయ్యిమంటూ దూసుకెళ్తున్నారు. కుటుంబ పోషణ కోసం ట్యాక్సీ, ఆటోలు నడిపేవాళ్లే కాకుండా.. లగ్జరీ కార్లు కొనడంలోనూ ఆడవాళ్లు ఆసక్తి చూపుతున్నారు. సెకండ్ హ్యాండ్ కార్ల అమ్మకం సంస్థ.. 'స్పిన్నీ' ఈ విషయాన్ని వెల్లడించింది. దేశంలోని మహిళా డ్రైవర్లపై ఇటీవలే ఓ సర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా పలు విషయాలను వెల్లడించింది. 2025 నివేదిక ప్రకారం.. మనదేశంలో సెకండ్ హ్యాండ్ కార్ల కొనుగోలుదారుల్లో మహిళల వాటా.. 46 శాతంగా ఉన్నది. 2023లో వీరివాటా కేవలం 16 శాతం మాత్రమే! ఢిల్లీ-జాతీయ రాజధాని ప్రాంతం పరిధిలో అత్యధికంగా 48 శాతం కొనుగోలుదారులు మహిళలేనట. ముంబై నగరం.. 46 శాతంతో ఆ తర్వాతి స్థానంలో నిలిచింది. వీరిలో దాదాపు సగంమంది డ్రైవర్లుగా రోడ్లపై నిత్యం చక్కర్లు కొడుతున్నారు. మామూలు కార్లేకాదు.. లగ్జరీ బ్రాండ్ వాహనాల కొనుగోలులోనూ ఆడవాళ్లు ఆసక్తి చూపుతున్నారు. మెర్సిడెస్-బెంజ్ కొనుగోలుదారుల్లోనూ 15 శాతం మహిళలే ఉన్నట్టు సర్వేలో తేలింది. అదే సమయంలో కొత్త కార్ల కొనుగోలులో మాత్రం మహిళలు తక్కువగా ఉన్నారని వెల్లడించింది. అయినా.. గతంతో పోలిస్తే వాహనరంగంలో మహిళా శ్రామిక శక్తి పెరుగుతున్నదని సర్వే ప్రతినిధులు చెబుతున్నారు. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే..

పురుషులు తక్కువ ధర, బేసిక్ వేరియంట్ల వైపు ఎక్కువగా ఆకర్షితులవుతున్నారట. అందుకు భిన్నంగా.. మహిళలు మధ్యస్థ, అగ్రశ్రేణి వేరియంట్ల వైపు మొగ్గు చూపుతున్నారని సర్వే చెబుతున్నది. మెరుగైన ఫీచర్ల కోసం ఎక్కువ ధర చెల్లించడానికీ మహిళలు ముందుకొస్తున్నారట. బ్రాండ్‌తోపాటు అనుభవానికి కూడా ఆడవాళ్లు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారనీ, వారి ఆసక్తి, ప్రోత్సాహంతో వాహనరంగంలోనూ రాకెట్ వేగంతో దూసుకెళు న్నారనీ సర్వే ప్రతినిధులు చెబుతున్నారు.

# అన్ని రకాలుగా ఆరోగ్యంగా ఉండాలని చూస్తున్నారా..?



ఆరోగ్యంగా ఉండేందుకు మనకు అనేక రకాల డైట్స్ అందుబాటులో ఉన్నాయి. ఎవరైనా సరే తమ సౌకర్యానికి అనుగుణంగా ఉండే డైట్‌ను పాటిస్తుంటారు. అయితే ప్రస్తుతం ఒక డైట్ మాత్రం బాగా ట్రెండింగ్‌లో ఉంది. అదే మైండ్ డైట్. రెండు రకాల డైట్‌లను కలిపి ఈ డైట్‌ను రూపొందించారు. మెడిటరేనియన్‌తోపాటు డ్యాష్ డైట్‌ను కలిపి మైండ్ డైట్‌ను రూపొందించారు. రష్ యూనివర్సిటీ మెడికల్ సెంటర్‌కు చెందిన పరిశోధకులు ఈ డైట్‌కు రూపకల్పన చేశారు. ఇందులో భాగంగా పలు ఆహారాలను వారంలో నిర్దిష్టమైనన్ని సార్లు కచ్చితంగా తీసుకోవాలి. అలాగే కొన్ని ఆహారాలను తీసుకోవడం మానేయాలి. లేదా వారంలో చాలా తక్కువ సార్లు తీసుకోవాలి. ఇలా మైండ్ డైట్‌ను పాటించాల్సి ఉంటుంది. దీంతో అనేక ప్రయోజనాలు పొందవచ్చని పరిశోధకులు చెబుతున్నారు.

**ఏం తినాలి..?:** మైండ్ డైట్‌లో బాగంగా వారంలో కనీసం 6 సార్లు కూరగాయలు, ఆకుకూరలను తినాలి, పిండి పదార్థాలు లేని కూరగాయలను ఏదో ఒకటి కచ్చితంగా రోజూ తినాలి

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215